# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎన్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి



VOLUME 32 ISSUE 4
No. OF PAGES 40
DECEMBER 2012

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో**........................... ....... **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| యోగి వేమన | 3 |
| శ్రీబాబూజీ ఉవాచ | 4 |
| శ్రీమాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 8 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 10 |
| యోగవాశిష్ఠము | 12 |
| గురు కృపాహి కేవలమ్ | 14 |
| ఆశకి బానిస | 15 |
| ఆచార్యదేవో భవ! | 16 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 18 |
| పరిప్రశ్నేన సేవయా | 20 |
| వైద్యవిధానానికి ఆవల ధ్యానం | 21 |
| స్థిత ప్రజ్ఞుడు | 23 |
| విశ్వాసమే రక్ష | 25 |
| వరదబాధితులకు సహాయం | 27 |
| బాబూజీతో అనుభవాలు - అక్షతల మహిమ......... | 29 |
| మేలిముసుగు........... | 32 |
| కాలాతీతుడు .................. | 34 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 35 |
| శ్రీరాధామాధవ రస సుధ | 37 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

నాన్నృతం నా ప్రియం చైవ న గర్వం నాపివా బహు
నని యోగ పరం బ్రూయాద్గురో రాజ్ఞాం విభావయేత్ ॥
(గురుగీత 147 శ్లో)

గురుభక్తుడు తానాశ్రయించిన సద్గురుదేవునియందు ప్రవర్తించవలసిన విధానమును వివరించే ఈ శ్లోకమును ఈశ్వరుడు పార్వతీదేవికి స్వయంగా ఉపదేశించిన విషయమును గ్రహించి తగిన రీతిగా సంచరించ వలసిన అవసరము ఎంతైనా ఉంది.

సద్గురుమూర్తి సన్నిధిలో సత్యమును, ప్రియభాషణమును చేయవలెను. సద్గురుమూర్తి సంయమనశీలురు గనుక వారిచ్చిన చనువును అపార్థం చేసుకుని లేనివి పోనివి కల్పించి మాట్లాడ కూడదు. శిష్యుడు స్వతంత్రించి, ఈ వ్యవహారము యిలా చేస్తే బాగుంటుందని విధిపూర్వకముగా సద్గురుమూర్తికి వచించరాదు.



సద్గురుమూర్తి ద్వారా అనుక్షణము ఏ సందేశము వచ్చునా అని ఎదురు చూసి నిరీక్షణ చేసే శిష్యుడు ధన్యుడు. సర్వకాల సర్వావస్థలయందు సద్గురుమూర్తిని సర్వ రక్షకుడు, సర్వేశ్వరుడు, సర్వాంతర్యామి అనే భావనతో స్తుతిస్తూ, నమస్కరిస్తూ, ధ్యానిస్తూ, తదేకనిరతుడై అనన్యశరణుడై ఉండాలి.

శిష్యుని మరణ భయము నుండి విముక్తుడను చేసి నీవు శాశ్వితాత్మా స్వరూపుడవని బోధించి, జ్ఞానస్వరూపుని గావించు సద్గురుమూర్తి రక్షణ మహిమను గుర్తించగలిగిన వారెవరు?

సచ్చిదానంద స్వరూపుడు, నిత్యుడు, పరిపూర్ణుడు, త్రిగుణాతీతుడు అయిన సద్గురుమూర్తిని ఆశ్రయించిన శిష్యుడు ధన్యుడు.

దానిని గుర్తించి, తనకి సంప్రాప్తించిన సదవకాశాన్ని సద్వినియోగము చేసుకుందురు గాక!!

*

# యోగి వేమన

గత సంచిక తరువాయి — శ్రీ బులుసు వెంకటరమణయ్య

13. ఇహమునందుఁ బుట్టి యింగిత మెఱుఁగని
జనుల నెంచి చూడ స్థావరములు
జంగమాదులనుట జగతిని పాపంబు
విశ్వదాభిరామ! వినురవేమ!



తాత్పర్యము –

జన్మ యెత్తినందుకు జ్ఞానము సంపాదించవలెను. అది లేనివారు స్థావరముల వంటివారు. వారిని మనుష్యులలో లెక్కింపరాదు.

14. ఉత్త తిత్తి దీని యుపయోగములు లేవు
తిత్తి కొరకు చెడును దేవులాడి
కత్తిమీదిసాము కడతేఱబోదయా
విశ్వదాభిరామ! వినురవేమ!

తాత్పర్యము –

స్త్రీ శరీరము ఉత్త తిత్తివంటిది. నిరుపయోగమైనది. దానికొరకు దేవులాడినచో నరుడు చెడిపోవును. స్త్రీ సాంగత్యము కత్తిసాము వంటి ప్రమాదకరము. మోక్షమునకు చాల దూరమైనది.

15. ఉన్నదానిని గను మూపిరి బిగఁబట్టి
కన్నుమూసి యేమి కానలేవు,
విన్నదన్నదెఱుక విజ్ఞానమని నమ్ము
విశ్వదాభిరామ! వినురవేమ!

తాత్పర్యము –

నీలో ఉన్న ఆత్మను తెలిసికొనుము. ఊపిరి బిగించి కన్నులు మూసిన మాత్రమున ఏమియు తెలిసికొనలేవు. నేను చెప్పినది వినుము. విజ్ఞానమే బ్రహ్మమని తెలుసుకొనుము.

# శ్రీబాబూజీ ఉవాచ

– పరాశర ప్రసాద్

“బ్రహ్మ సత్యం, జగన్మిధ్య” అని అంటారు కదా! “ఈ కనపడే జగత్తుని కాదని ఎలా అనగలం” అని శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులని ప్రశ్నించారు.

శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ “నీవు ఎవరవు? నీవు సత్యమేనా? నీ దేహం అశాశ్వతమైనదేగా! పరిణామం చెందేదే కదా! మీ చిన్న తనంలో గంతులు వేసినట్లుగా ఇప్పుడు వేయగలరా? అలా చేయలేరు కదా! ఈ రోజు మీ దేహంలో వున్న పటుత్వము, శక్తి రేపు ఉంటుందని గ్యారంటీ ఉందా! అలాగే ఈ జగత్తు కూడా పరిణామంతో కూడినది. అశాశ్వతమైనది. కాని దీనిని ప్రకాశింపజేసేది ఒకటి ఉంది. అదే చైతన్యము. అది శాశ్వతమైనది. అలాగే నీ దేహంలో చిన్నతనం నుంచి ఈనాటి వరకు మార్పుచెందనిది ఒకటి ఉంది. అదే ఆత్మవస్తువు. దానికి పరిణామం లేదు. అది శాశ్వతమైనది. నువ్వు జగత్తులో వాడివే కదా అందువలన నువ్వు జగత్తు శాశ్వతమైనదిగా భావిస్తున్నావు.



నువ్వు నిదురిస్తున్నావనుకో కలత నిదురలో ఏవేవో దృశ్యాలు చూస్తావు. ఎన్నో సంఘటనలు స్వయంగా అనుభవిస్తావు. సుఖము కలిగితే ఆనందిస్తావు. కష్టము కల్గితే దుఃఖిస్తావు. దుఃఖము కల్గిన నిదర్శనము కూడా ఉంటుంది. ఈ అనుభవాలన్నీ నువ్వు కలత నిదురలో స్వప్నంలో పొందే అనుభూతి. అది యాదార్ధమేనా? స్వప్నంలో ఉన్నంత వరకు అవి యదార్ధమేకదా! మెలుకువ వచ్చిన వెంటనే అది యదార్ధము కాదని తెలుసుకుంటావు.

ఇంకొక దృష్టాంతము చెబుతాను. సంధ్య వెలుగులో అంటే సూర్యాస్తమయం అయిన కొలది సేపటికి నీ గృహం వెలుపల ఒక త్రాడును చూచి సర్పంగా భావించి భయపడిపోయి ఇంట్లోకి పరుగెత్తుకొని వెడతావు. మళ్లీ నీవే ఒక టార్చిలైటు తీసుకొని వెళ్ళి లైటు వేయగానే అక్కడ ఉన్నది సర్పము కాదనీ, త్రాడని గ్రహిస్తావు. దీనినే రజ్జుసర్ప భ్రాంతి అంటారు. చీకటిలో భ్రాంతి చేత త్రాడుని సర్పంగా భావించావు. లైటు వేయగానే ఆ భ్రాంతి తొలగి పోయింది.

అలాగే జగత్తులో ఉన్నంత వరకు ఈ జగత్తు శాశ్వతము అనే భ్రమ తొలగదు. ఈ జగత్తునుండి బయట పడితే శాశ్వతమైన ఆత్మ వస్తువును గుర్తించగల్గుతావు. నీలో

అజ్ఞానమనే చీకటి జగత్తు శాశ్వతమైనదిగా భ్రమింపజేస్తుంది. అజ్ఞానమనే చీకటి తొలగి జ్ఞానసంపన్నుడవైన మరుక్షణం శాశ్వతమైన వస్తువును గుర్తిస్తావు. బ్రహ్మజ్ఞాన్నిఎప్పుడూ ఆ స్థితిలోనే ఉంటాడు. అటువంటి బ్రహ్మజ్ఞానిని ఆశ్రయిస్తే నీలో జన్మ జన్మలనుంచి పేరుకుపోయిన అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞాననేత్రాన్ని ప్రసాదిస్తాడు. అందువలననే లోకంబులు, లోకేశులు, లోకస్థులను దాటినపుడే పెంజీకటికావల ప్రకాశించే తేజస్సును దర్శించ గల్గుతావు అన్నాడు మా పోతనామాత్యుడు.

శ్రీబాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ మానవుడు జన్మజన్మల నుంచి ఆర్జించిన శాస్త్రవాసనల ద్వారా అహంకారాన్ని పెంచుకుని ఆత్మవస్తువును దర్శించలేక పోతున్నాడు. శాస్త్రాలు వేదాంత గ్రంథాలు చదవడం తప్పుకాదు, ఆ గ్రంథాలలో వివరించిన వాటిని అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలి.

ఎంతటి ప్రచండ మహాపండితుడైనా, ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని వుపన్యాసాలు అనర్గళంగా చెప్పినా, ఎంతమంది ప్రజలు మెచ్చుకున్నా, ఎన్ని సత్కారాలు పొందినా, ఎంతధనంకూడబెట్టినా, ఎన్నిఉన్నతపదవులు అధిరోహించినా, గురూపదేశము లేనిదే ఆత్మసందర్శనం అసాధ్యము. ఇది మాత్రము యదార్థము,

ఎంతో గొప్ప సాధన చేసి, అణిమాద్యష్ట విద్యలు సాధించి, వాటికి దాసుడై యోగభ్రస్టులైనవారు ఎంతమందో ఉన్నారు. యోగభ్రష్ఠులైనవారు ఎవరైనా జన్మకు రాకతప్పదు. మీ అందరికీ జడభరతుడి చరిత్ర తెలుసుకదా! మమకారానికి దాసుడై పునర్జన్మ పొందక తప్పలేదు కదా!

"***శరీరం సురూపం, తదావాకళత్రం, యశశ్చారు చిత్రం, ధనం మేరుతుల్యం, గురోరంఘ్రి పద్మేమనశ్చేన లగ్నం, తథఃకిం, తథఃకిం, తథఃకిం తథఃకిం***" చూశారా! ఎంతటి ధనవంతుడైనా, కీర్తి ప్రతిష్ఠలు కలవాడైనా జగన్మోహనాకారుడైనా, సౌందర్యవతియైన భార్య ఉన్నా, సద్గురుమూర్తి యొక్క దివ్యచరణారవిందములను ఆశ్రయించని వారి జీవితం హుళక్కే! సద్గురుమూర్తి యొక్క అభయహస్తం సదా ఆశీస్సులను అందజేస్తూనే ఉంటుంది.

ఆ ఆశీస్సులను అందుకునే మనోప్రవృత్తి నువ్వు కలిగి ఉండాలి. గురుసాన్నిధ్యంలో అహంకారపూరితమైన ప్రసంగాలు గానీ, వ్యర్థప్రసంగాలు గానీ ఎన్నడూ చేయరాదు. సాధకులు గురుమూర్తి యందు వినయ విధేయతలు కలిగి వుండాలి ***వాసుదేవ స్సర్వమితి, సమహాత్మా సుదుర్లభః*** సర్వవ్యాపకుడైన భగవానుడు సగుణమూర్తియై అవతరించి వచ్చినా గుర్తించగల్గిన వారు ఎంతమంది?

*

# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాలా ప్రసాద

ఆ విధంగా పూజారిని గమనించిన తిన్నడు, "ఓహో! దేవుడంటే ఈయనన్నమాట! నేనూ అలాగే పూజ చేస్తాను" అని అనుకున్నాడు. కేవలం చూడటం వలన తిన్నడుకి ఇటువంటి మంచి భావన కలిగింది. మనకి కూడా మంచి వేపు వెళితే మంచి అబ్బుతుంది. మంచిని వినడం వల్ల మంచి అలవడుతుంది.

*'సాధూనాం దర్శనం పుణ్యం'* అన్నారు. సాధుజనుడయిన పూజారిని చూడటం వలన తిన్నడికి పుణ్యం లభించింది. వెంటనే పూజారి అక్కడినుండి వెళ్ళిపోయాక తను శివుడికి పూజ చేద్దామనుకున్నాడు. ఒక అడవిపంది మాంసాన్ని ముక్కలు కోసి చక్కగా వేయించి బాగున్నాయో లేదోనని రుచిచూసి వాటిని ఒక చేతిలో పెట్టుకున్నాడు. రెండో చేతిలో పూలు తీసుకున్నాడు.



మరి స్వామికి స్నానం చేయించడానికి నీళ్ళలాగ అనుకుని, చేతులు ఖాళీలేక, స్వర్ణముఖి నదీ జలాలని పుక్కిట పట్టుకుని, శివలింగం దగ్గరకి వెళ్ళాడు. అక్కడ యింతకు ముందు పూజారి పూజ చేసిన పూవులూ అవీ కనిపించాయి. ఆ నిర్మాల్యాన్ని తన చెప్పుకాలితో ప్రక్కకు తోసేసి, నోటిలో పట్టుకు వచ్చిన నదీ జలాలతో అభిషేకం చేశాడు. ఒక చేతితో తెచ్చిన పూలని స్వామిమీద వేసి, మరో చేతిలో వున్న వేయించిన పంది మాంసము ముక్కలని తినమని కోరాడు.

అంతా చేసి ఆనందంగా స్వామిని చూస్తున్నాడు తిన్నడు. నున్నగా గుండ్రాయిలాగా వున్నాడు స్వామి. ఆయన కంటినుండి రక్తం కారుతూ కనిపించింది. 'అయ్యో!' అని వాపోయాడు తిన్నడు. తనకు తెలిసిన పసర్లన్నీ తెచ్చి ఆయన కంట్లో పిండాడు. అయినా రక్తం కారడం తగ్గలేదు. అంతే! ఇక కంటికి కన్నే మందనుకున్నాడు తిన్నడు.

ఒక బాణం తీసుకుని తన కంటిని పెరికి, స్వామి కన్ను మీద అతికాడు! అనురక్తి, ఆవేదన ఉన్న చోట నొప్పి అన్నది కూడా తెలియదు. 'అమ్మయ్య!' స్వామికి స్వస్థత చేకూరింది అనుకున్నాడు. ఇంతలోస్వామివారి రెండో కంటినుండి రక్తం కారడం మొదలుపెట్టింది. ఇప్పుడు తన రెండో కన్నుని స్వామికి పెట్టాలి. కానీ తనకి స్వామికన్ను ఎక్కడున్నదీ ఎలా తెలుస్తుంది? అని అనుకుని తిన్నడు ముందుగా స్వామి వారి రెండో కన్ను ఉన్నచోట తన పాదాన్ని గుర్తుగా పెట్టి, తన కన్ను పీకి స్వామి రెండో కంటి దగ్గర

పెట్టాడు! జగత్తంతా వ్యాపించిన చక్షువులు (కన్నులు) కలిగిన పరమశివుడికి తన కళ్ళనిచ్చి తిన్నడు 'కన్నప్ప' అయ్యాడు.

ఈ సన్నివేశాన్ని శ్రీ ఆదిశంకర భగవత్పాదులవారు తమ 'శివానందలహరి'లో ఒక చక్కని శ్లోకంలో వివరించారు.

*"మార్గా వర్తిత పాదుకా పశుపతే రంగస్య కూర్చాయతే*
*గండూషాంబు నిషేచనం పురరిపోర్దివ్యాభిషేకాయతే*
*కించిద్భక్షిత మాంసశేష కబలం నవ్యోపహారాయతే*
*భక్తిః కిమ్ న కరోత్యహో! వనచరో భక్తావతంసాయతే॥"*

అనేకసార్లు వేసుకుని అడవుల్లో తిరిగి తిరిగి అరిగిపోయిన చెప్పు శివుడి భ్రూమధ్యంలో చోటు చేసుకుంది. నోటిలో పుక్కిలి పట్టి ఉమ్మిన నీరు ఆ త్రిపురాంతకుడికి దివ్యాభిషేకం అయింది. కొంచెం తాను తిని ఎంగిలి చేసి పెట్టిన మాంసఖండం క్రొత్త నైవేద్యమయింది. ఆహా! భక్తికి సాధ్యం కానిది ఏముంది? అడవులలో తిరిగే వనచరుడు భక్తులలో అగ్రగణ్యుడు అయ్యాడు!" అన్నారు శ్రీశంకరులు.

ఆ సదాశివుడు భోలాశంకరుడు. భక్తితో ఒక గ్లాసుడు పంపునీళ్లు ఇచ్చినా, నాలుగు మారేడు దళాలు వేసినా ఆనందించి, కోరినవన్నీ ఇచ్చేస్తాడు. తన భక్తుడు ఏది ప్రేమతో ఇస్తే దానినే ఆనందంగా ఆరగిస్తాడు.

కానీ మనమో? ఎవరైనా ప్రసాదం పెడితే ఉప్పు ఎక్కువయిందనో కారం తక్కువయిందనో రుచులు ఎంచుతాం. అంతేకాదు మనకిష్టమైన దధ్యోజనమో, పులిహోరో అయితే, మాట్లాడకుండా ఎంత పెట్టినా తీసుకుంటాం. ఇష్టం లేని ఏ చక్కెర పొంగలి లాంటిదో అయితే "ఆ! ఆ! చాల్లెండి. ప్రసాదం ఎంతకావాలీ?' అని ఒకమెతుకు నోట్లో వేసుకుంటాం! లేకపోతే, "అబ్బా!అస్తమానూ ఈ ప్రసాదమే చేస్తారేమిటి ఇంకేమీలేనట్టు" అనే విమర్శలు వినిపిస్తూ వుంటాయి. ప్రసాదాన్ని ప్రసాదభావంతో తీసుకోవాలి గాని, పదార్థభావన పనికి రాదు. ఇది వేదాంతం ఒప్పుకోదు.

– సశేషం

*ధ్యానమనే అగ్నితో మనో మాలిన్యాన్ని దగ్ధం చేయబడినప్పుడు, స్వచ్ఛమైన ఆత్మజ్యోతి కనిపిస్తుంది.*

– హనుమత్కాళీ వర ప్రసాద బాబు

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

22.6.85

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "మేఘము కమ్మినపుడు సూర్యకాంతి ఎలా మరుగుపడిపోతుందో అలాగే జీవభ్రాంతి అనే నల్లని దట్టమైన తెర మానవుని హృదయములో అడ్డుగా నిలిచి తన సస్వరూపమును మరుగుపరుస్తుంది. జీవభ్రాంతి మమకారాన్ని అహంకారాన్ని తెచ్చిపెడుతుంది. జీవభ్రాంతి మూడుతాళ్ళతో కూడిన జీవబంధన. దీని వలననే మానవుడు ఈశ్వరతత్వాన్ని మరచిపోతున్నాడు. సత్వరజస్తమోగుణాలే మానవుని బంధించే మూడు తాళ్ళ పగ్గము. అది తెలుపు, ఎరుపు, నలుపు అనే మూడు గుణాలతో కూడినది. రజో గుణము మానవునిలో ఆశ



కోరిక కలిగించి అవి తీరకపోతే తీవ్రమైన క్రోధానికి గురి చేస్తుంది. అలాగే తమోగుణము సోమరితనము, బద్ధకము, నిదుర, మూర్ఖత్వము, స్వార్థము, నీచదృష్టిని కలగజేస్తుంది. జీవభ్రాంతి అనే తెరతొలగిపోగానే ఈశ్వరుడిని తన నేత్రాలతోనే సందర్శిస్తాడు. భగవన్నామాన్ని ఎవరి హృదయం ఆకర్షిస్తుందో ఎవరి హృదయంలో ఆ దివ్యచరణావిందములు నిలుపుకుంటారో వారి హృదయం సంపూర్ణ శాంతితో వికసిస్తుంది.

పరమాత్మునిపై మనస్సు నిలిపిన మానవునికి, ప్రాపంచిక భోగభాగ్యములు, విషయాదులపై లగ్నమైన మనస్సుగల మానవునికి, తేడా ఉండక మానదు. ఆ తేడా బాబు గారు చూపగలుగుతారా అనే సందేహం మీ అందరికి కలగవచ్చు. మీ అందరి గృహాల్లో ఎలక్ట్రిక్ బల్బులు ఉంటాయి కదా! అవి స్విచ్ వేస్తేనే ప్రకాశిస్తాయి. స్విచ్ వెయ్యకపోతే అవికాంతిని ఇవ్వగలుగుతాయా? అలాగే మానవుని మనస్సులో మాధవుని నిలుపు కొన్నప్పడు మాయ అనే తెర తొలగి అత్మతేజస్సుని దర్శించ గలుగుతాడు.

గోపికలు ఆత్మతేజస్సుని దర్శించారు గనుక ఆ తేజస్సులో త్రిగుణములతో కూడిన జీవ బంధన అనే త్రాడు కాలిపోయి వారు బంధ రహితలై వారి మోహము, అహంకారము, మమకారము తొలగిపోయాయి. గోపికల మనస్సు అనే గాజుపలక మీద కళాయి పడింది. గాజుపలకలో మనరూపము కనపడదు. గాజుపలకపైన

కళాయివేస్తే మనరూపమే కనపడుతుంది. గోపికలు కృష్ణ నామము ద్వారా తయారైన భక్తి అనే రసాయనమును అద్దము అనే మనస్సుకి పూసుకున్నారు. కృష్ణపరమాత్ముని దర్శించారు. కాని మానవుడు కారు కాదని రైలుని, రైలుకాదని విమానాన్ని ఇలాగే ఒకదాని కంటే ఇంకొకటి సౌఖ్యమనుకొని ప్రేమిస్తాడు కాని శాంతిని పొందలేడు. వెదురుమంచం కన్నా నులకమంచం మంచిదనుకుంటాడు. దానికన్నా గంధపు చెక్కతో చేసిన మంచం ఇంకా మంచిదనుకుంటాడు. అలాగైనా శాంతిని పొందగలుగుతున్నాడా?

ఒక ఇంటి కోడలుకి అత్తింటివారు పుట్టింటివారు కలిసి సురాజ్‌మల్ జ్యూయలరీ షాపు నుంచి డైమండ్ నెక్లెసు, ఉంగరం, ముక్కుపుడక అన్ని మ్యాచ్ అయ్యే విధంగా తీసుకున్నారు. ఈ అలంకారాలన్నీ శాంతిని ఇవ్వగలుగుతాయా? పోనీ నిదుర పడుతుందా? ఇంట్లో దొంగల భయం. బయట ఇన్‌కంటాక్స్ భయం. ఇంకా అలంకరణ కోసం లిప్‌స్టిక్ వేసుకుంటారు. అది నోటికి శుభ్రతని ఇవ్వగలుగుతుందా?

పరమాత్ముని పాదద్వయం ఎవరి హృదయంలో నిలుపుకుని ధ్యానం చేస్తారో వారికి శాంతి. వారి ముఖంలో చిరునగవు తాండవిస్తుంది. 100 రూపాయలు జేబులో ఉంటే బజారులో ఎగురుతాడు. రూపాయలు జేబులో లేకపోతే ముఖము తోటకూర కాడలాగా ఉంటుంది. ఒక బిందెలో నీరు ధారగా పడితే వెలితి ఉండదు. కలుషము మలినము ఉండదు. కృష్ణుడు గంతులు వేస్తుంటే గజ్జలు ఘల్లు ఘల్లు మనగానే గోపికల హృదయాలలోని సంకల్పాలు, కోరికలు పటా పంచలవుతాయి. అందువలననే వారి దృష్టి ఎప్పుడూ నాసికాగ్రముననే నిలిచి ఉంటుంది. దానినే నాసికాగ్రముద్ర అంటారు. ఆముద్రలోనున్నవారి ముఖము కాంతితో ప్రకాశిస్తుంది.

*



కళత్రం ధనం పుత్ర పౌత్రాది సర్వం
గృహం బాంధవాః సర్వమేతద్ధి జాతమ్
గురోరంఘ్రి పద్మే మనశ్చేన్నలగ్నం
తతఃకిమ్ తతఃకిమ్ తతఃకిమ్ తతఃకిమ్ ॥

# శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు

**<u>డిసెంబర్ 2012</u>**

**డిసెంబర్ 1 శనివారం నుండి 9 ఆదివారం వరకు శ్రీ గురుదేవుల చతుర్వింశతి వార్షిక పుణ్యారాధన మహోత్సవాలు**

1 శని ఉదయం పంచ యజ్ఞ సహిత పుణ్యారాధన మహోత్సవ సాప్తాహ్నిక దీక్షా స్వీకరణ, ఉదయం 8గం॥01నిలకు పంచ యజ్ఞ ప్రారంభం. ప్రతిరోజు ఉదయం 8 గం.లకు శ్రీ రామ తారక పరబ్రహ్మప్రసాద్, శ్రీ వెంకటరమణ ప్రసాద్ గార్లచే శ్రీ గురుగీతా ప్రవచనము.

1 శనివారం నుండి – 9ఆదివారం వరకు ప్రతిరోజుఉదయం4గం.కు సుప్రభాతం, నగర సంకీర్తన 5 గం.లకు ప్రాతఃకాల ప్రార్థన మహామంగళ హారతి. 6గం.లకు బ్రహ్మశ్రీ కొండూరి రామ సుబ్రహ్మణ్యం గారిచే వేద పఠనము, ఆలయ దర్శనములు, తీర్థ ప్రసాదములు

1 – 8 వరకు మధ్యాహ్నం శ్రీ సద్గురు శత సహస్ర నామార్చనము, మహామంత్ర పుష్పము, దర్బారు. అనంతరం శ్రీ మాతాజీవారు భక్తులకు తీర్థం ఇస్తారు. భక్త సమారాధన. సాయంత్రం 6 గం.లకు ప్రార్థన మహా మంగళహారతి

2 – 7 వరకు ఉదయం 9 గం.లకు సత్సంగ సమావేశము, శ్రీ మాతాజీవారి అనుగ్రహభాషణ సద్గురుదేవుల దర్శనము,బోధ (వీడియో).శ్రీ బాబూజీ మహరాజ్ వాడిన వస్తువుల మ్యూజియమ్ ప్రదర్శన (అర్ధగంట)

<u>విశేష కార్యక్రమాలు.</u>

2 ఆది రాత్రి 7 గం॥లకు డోలోత్సవం (ఊంజల సేవ)

3 సోమ శ్రీ సద్గురుదేవులు ఆంగ్ల కాలమాన ప్రకారం స్వస్వరూపలయం పొందిన రోజు.

6 గురు రాత్రి 7గం.లకు తెప్పోత్సవం (నౌకావిహారం)

8 శని_శ్రీ గురుదశమి, తె.జా. 3 గం.లకు శ్రీ సద్గురుదేవులకు రుద్ర, నమక చమక సహిత మహాభిషేకము. ఉదయం 7గం.లకు సామూహిక సద్గురు పూజలు. శ్రీ సద్గురు పాదపూజ, రాత్రి 7 గం.లకు శ్రీ సద్గురుదేవుల మహాపుణ్యారాధన.

**9** ఆది ఉదయం మహామంగళహారతి. దీక్షావిరమణ, స్వామివారి నగర దర్శనోత్సవము. గమనిక –పెద నింద్రకొలను ఆశ్రమశాఖలో శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన, సత్సంగం, తెప్పోత్సవం.

11 మంగ మాసశివరాత్రి

**<u>16 ఆది నుండి ధనుర్మాస కార్యక్రమాలు</u>** – ఉదయం 9.30 గం,లకు సంకీర్తన, 10 గం. లకు తిరుప్పావై, 10.30 గం.లకు ఋషుల చరిత్ర, 11 గం.లకు శ్రీమదాంధ్ర మహాభాగవత ప్రవచనము, సత్సంగం, పార్థన, తీర్థ ప్రసాదములు.

18 మంగ శ్రీ సుబ్రహ్మణ్యషష్టి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, సహస్రనామార్చన.

23 ఆది గీతా జయంతి, ముక్కోటి ఏకాదశి, శ్రీ సద్గురు పాదపూజ, ఏకాహం, భక్త సమారాధన

25 మంగ క్రిస్మస్ - శ్రీసద్గురు పాదపూజ. సత్సంగం

28 శుక్ర పూర్ణిమ, దత్తాత్రేయ జయంతి, శ్రీసద్గురు పాదపూజ.

**జనవరి 2013**

1 మంగ ఇంగ్లీషు సంవత్సరాది, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

7 సోమ గురుదశమి, సత్సంగం శ్రీ సద్గురు పాదపూజ

10 గురు మాసశివరాత్రి

13 ఆది భోగి పండుగ, శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన. రాత్రి 8 గంటలకు శ్రీసద్గురుదేవులకు భోగి పళ్ళు పోయుట

14 సోమ మకర సంక్రాంతి,(ఉత్తరాయణ పుణ్యకాలం),శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

15 మంగ కనుమ

26 శని రిపబ్లిక్ డే, పూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులైన శ్రీమతి రాజరాజేశ్వరి (కీ॥శే నేలభొట్ల రామ్మూర్తిగారి ద్వితీయ కుమార్తె) 21-10-2012 ఆదివారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 62సంవత్సరాలు. వీరికి ఒక కుమార్తె కలరు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరుగాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

సంస్కృత భాషలో అతి ప్రాచీనము, అత్యుత్తమమైన వేదాంత గ్రంథరాజము వశిష్ఠ మహారామాయణము లేదా యోగవాశిష్ఠము. సంస్కృత వాఙ్మయములో యీ మహెూత్కృష్టమైన గ్రంథమునకు దీటైనది మరొకటి లేదు. వశిష్ఠ మహర్షి ప్రముఖమైన వేదాంత ప్రధానాంశములను తన ప్రియశిష్యుడైన అయోధ్యరాకుమారుడు, అవతార పురుషుడైన శ్రీరామచంద్ర ప్రభువునకు ఉపదేశించాడు.



రామాయణ మహాకావ్యమునకు నాయకుడై, రావణ సంహారము చేసిన యుగపురుషుడు శ్రీరామచంద్ర ప్రభువు. వేదాంత ప్రధానాంశములను శ్రీరామచంద్ర ప్రభువునకు చక్కగా వివరించటానికై, వశిష్ఠ మహర్షి చక్కని కథలతో మేళవించి వివరించారు. ఈ గ్రంథము వాల్మికి మహర్షి చేత సంస్కృత భాషలో వ్రాయబడ్డది.

వేదాంత గ్రంథములన్నిటికి యోగవాశిష్ఠము లేక జ్ఞానవాశిష్ఠము చూడామణి వంటిది. ఇది సాటిలేని మేటి గ్రంథము. ఈ గ్రంధపఠనము, అవగాహన శ్రద్ధగా చేసిన సాధకుడు దివ్యజ్యోతి, బ్రహ్మానందమనే అత్యున్నత శిఖరాలను చేరుకొనుట తథ్యము. ఆత్మ విచారణ చేసే సాధకులకు యీ అద్భుత గ్రంథమొక జ్ఞాన కోశాగారము వంటిది. ఆత్మ సాక్షాత్కారమునకై సాధన చేసే పాఠకులీగ్రంథమును యేకాగ్రచిత్తముతో అవగాహన చేసుకుంటే, సాధన మార్గములు పుష్కలంగా లభిస్తాయి. ప్రాపంచిక విషయాలలో నిమగ్నమైన మానవుడు కూడా యీ గ్రంథాధ్యయనము చేసి, వైరాగ్యమును, మానసిక శాంతి, సంతృప్తిని సాధించగలడు.

వశిష్ఠ గీతలోని అంశాలను చర్చించుకొనే ముందు, గ్రంథపరిచయ ఆవశ్యకత ఉన్నది కాబట్టి, ఆ విషయం మీద దృష్టి కేంద్రీకరిద్దాము. ప్రాచీన కాలంలో ఈ వేదాంత గ్రంథానికి చాలా ప్రాచుర్యము ఉన్నది. ప్రాచీన గ్రంథాలలో యిది చాలా సమగ్రమై, గంభీరమై, లోతైన జ్ఞాన నిధి. రామాయణమును రచించిన ఆదికవి వాల్మీకి మహర్షియే యోగవాశిష్ఠమును రచించారు. వశిష్ఠ మహర్షి, శ్రీరామచంద్ర ప్రభూవుకి మధ్య జరిగిన ఆధ్యాత్మిక గురుశిష్య సంవాదమునే వాల్మీకి మహర్షి తన శిష్యుడైన భరద్వాజ మహర్షికి యోగవాశిష్ఠము ద్వారా తెలియజేశారు.

ఇందులో బృహత్‌యోగవాశిష్ఠము, లఘుయోగవాశిష్ఠము అని రెండు గ్రంథములున్నవి. 32000 శ్లోకాలతో కూడిన పెద్ద గ్రంథమును బృహత్‌యోగవాశిష్ఠము గాను, 6000 శ్లోకాలు కలిగిన చిన్న గ్రంథమును లఘుయోగవాశిష్ఠముగాను పరిగణించారు. పవిత్రభూమి భరతవర్షములో, వారసత్వముగ లభించిన ఆధ్యాత్మిక పవిత్ర గ్రంథము యోగవాశిష్ఠము. భారతీయ తత్త్వజ్ఞానానికే తలమానిక వంటిది.

జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న జీవాత్మ పరమాత్మ సంధానము గురించి చక్కగా వివరించే గ్రంథము యోగవాశిష్ఠము. జీవాత్మ పరమాత్మ సంధానమునకు సంబంధించిన అనేక సూచనలను వివరిస్తున్న మహాగ్రంథము. బ్రహ్మ లేక సత్ యొక్క స్వభావమును గురించి, ఆత్మ సాక్షాత్కారమును పొందుటకు అనువైన వివిధ మార్గములను గురించి చక్కగ వివరిస్తుంది యీ గ్రంథరాజము. ఈ గ్రంథము యోగవాశిష్ఠమని పిలువబడ్డా, జ్ఞానమును గురించే కూలంకషంగా చర్చిస్తుంది, యోగానుభవం గురించి రెండవ కథలోనే చెప్పబడింది. అందుకనే దీనిని జ్ఞానవాశిష్ఠము లేదా వశిష్ఠ గీత అని కూడా పేర్కొంటారు.

ఈ గ్రంథము ఆరు ప్రకరణములుగా విభజింపబడినది. 1. వైరాగ్య ప్రకరణము, 2. ముముక్షు ప్రకరణము, 3. ఉత్పత్తి ప్రకరణము, 4. స్థితి ప్రకరణము, 5. ఉపశాంతి ప్రకరణము, 6. నిర్వాణ ప్రకరణము.

ఈ గ్రంథమేమి సూచిస్తుందంటే, ఈ జగత్తులో అనేకానేక విషయాలతో, దేశకాలాదులతో పొందే అనుభవమంతా కేవలం కల్పన. మనస్సుతో సృజింపబడినది. ఎలాగైతే స్వప్నంలో మనసు అనేక వస్తువులను కల్పిస్తుందో అలాగే జాగ్రదవస్థలోని అనుభవాలు కూడా మనస్సుతో సృజింపబడినవి. మనస్సు యొక్క విస్తరణయే సంకల్పము. సంకల్పము వైవిధ్యమనే శక్తి చేత ఈ విశ్వాన్ని సృజిస్తుంది. దేశకాలాదులన్నీ మనోసృజితమే.

మనస్సు విషయాదులతో చేసే లీలతో, సన్నిహితంగా ఉండేది చాలా దూరంగా ఉన్నట్లు, దూరంగా ఉండేది చాల దగ్గరగా ఉన్నట్లుగా గోచరిస్తుంది. జాగ్రదావస్థలో క్షణికంగా ఉండే అనుభవాన్ని స్వప్నావస్థలో అనేక సంవత్సరాల అనుభూతిగా భావిస్తాము.కాని మనస్సు బ్రహ్మ కంటె భిన్నమైనది కాదు. బ్రహ్మమే మనసుగా గోచరిస్తుంది. మనసు సృజనాత్మకమైన శక్తి కలిగి అది బంధమోక్షములకు మూలకారణమైనది.

దృష్టి, సృష్టి వాదమనే సిద్ధాంతము యోగవాశిష్ఠములో చక్కగా వివరించబడినది. కొన్ని సందర్భాలలో శ్రీశంకర భగవత్పాదులవారి గురువుగారైన శ్రీగౌడపాదాచార్యులవారు ప్రతిపాదించిన అజాతివాదాన్ని కూడా ఈ గ్రంథంలో వశిష్ఠ మహర్షి స్పృశిస్తారు. ఆ వాదన ప్రకారం త్రికాలాలలో కూడా ఈ విశ్వానికి ఉనికి లేదు.

వశిష్ఠగీతలో సాక్షాత్ శ్రీమన్నారాయణుని అవతారమైన యుగపురుషుడు శ్రీరామచంద్ర ప్రభూవుకు వశిష్ఠమహర్షి గురుమూర్తిగా జ్ఞానబోధ చేశారు.

ద్వాపరయుగంలో భగవద్గీతలో సాక్షాత్ శ్రీమన్నారాయణ అవతారమైన శ్రీకృష్ణభగవానుడు గురుమూర్తిగా, నరుడైన అర్జుననకు జ్ఞానప్రబోధ చేశారు.

సర్వజ్ఞుడైన శ్రీరామచంద్ర ప్రభువు, గురుమూర్తియొక్క ఆవశ్యకతను మానవాళికి తెలియజేయటానికై శిష్యునిగా వైరాగ్యసంపన్నుడై, సందేహనివృత్తికి, సద్గురుమూర్తిని ఆశ్రయించారు.

– సశేషం

# గురు కృపా హి కేవలమ్

– రమణ ప్రసాద్

“మీరు నన్ను పరమాత్ముడు అని భావిస్తున్నారు కదూ! అటువంటి విశ్వాసం ఉండటం మంచిదే. మీ విశ్వాసం యొక్క శక్తి గొప్పది. అదే మిమ్మల్ని కాపాడుతుంది. నాదేముంది? నేను జగజ్జనని చేతిలో ఒక పనిముట్టుని మాత్రమే.

మీకు ఒక దృష్టాంతం చెబుతాను. మేమంతా అహోబిలం వెళ్ళాము. మాతో ఒక ఇంజనీరు కూడా వచ్చాడు. క్రింద నీటి ప్రవాహం. నేను వద్దని ఎంత చెప్పినా ఆ ఇంజనీరు స్నానానికని కొండ క్రింద ఉన్న నీటి ప్రవాహంలో దూకాడు. అంతే! మళ్ళీ కనిపించలేదు. అక్కడ ఉన్నవారంతా నిస్సహాయంగా కేకలు వేస్తున్నారు. నేను అమ్మని ప్రార్థించి, నా పంచ చెంగును గుండ్రంగా తిప్పి నీటిలోకి విసిరాను. అది నీటిలో మునిగిన ఇంజనీరుగారి శరీరానికి చుట్టుకుపోయి, అంతా కలిసి లాగితే ఒడ్డుకు వచ్చాడు. రక్షణ జరిగింది. మరి నీటిలో మునిగిన వ్యక్తిని కాపాడినది ఎవరు? నా రామ పాదుకల శక్తి వలననే రక్షణ జరిగింది కాని నాదేముంది?” అన్నారు శ్రీబాబు.

“ఇంకొక పర్యాయం ఉత్తరదేశ యాత్ర ముగించుకుని నేనూ, మూర్తీజీ, సంధ్య, విజయ కారులో డెహరాడూన్ నుంచి వస్తున్నాము. మూర్తీజీ కారు నడుపుతున్నారు. సంకీర్తన జరుగుతోంది. మూర్తీజీకి నిద్ర వస్తోంది. అది అస్సాం కొండల ప్రాంతం. అక్కడక్కడ పోలీసు గస్తీ కేంద్రాలు ఉన్నాయి. అది ప్రమాదభరితమైన ప్రాంతం అని మూర్తీజీకి చాలా సార్లు హెచ్చరిక చేశాను. నీకు నిద్ర వస్తే కారు నిలిపివేయి. దొంగల బారి నుండి నేను రక్షించుకుంటాను. ఏమాత్రం భయం లేదు అని చెప్పాను. కానీ మూర్తీజీ ప్రయాణాన్ని అలాగే సాగించాడు.

కారు అకస్మాత్తుగా ఒక బ్రిడ్జి మీద నుంచి 14అడుగుల లోతుకు క్రింద పడిపోయింది. కారు యిసుకలో పడి పక్కకు ఒరిగింది. కారు పడ్డ ప్రాంతంలో నీరు గానీ, రాళ్ళుగానీ లేవు. ఈ జరిగిన ప్రమాదం కొంచెం ముందుగానీ, వెనుకగానీ జరిగి ఉంటే కారులో ఎవరూ రక్షింపబడేవారు కాదు.

విజయ చెయ్యి కారు తలుపు క్రింద పడింది. నాకు కాలుకి పెచ్చులు లేచిపోయాయి. చేతివేలు వంకర పోయింది. సంధ్యకి పెద్ద గండం తప్పింది. ఇంత జరిగినా నాకేమీ తెలియదు. నేను ధ్యానంలో ఉన్నాను.

ఇంతలో కళ్ళు తెరచి చూశాను. పరిస్థితి ప్రమాదంగా ఉంది. ఒక్కసారి ‘అమ్మా!’ అని పిలిచాను. అంతే! అక్కడ ఉన్నట్లుగా పోలీసు పరివారం అంతా వెంటనే వచ్చారు. వారు కారును ఎత్తి మమ్మల్ని బయటకు తీశారు.

ఆ జగజ్జనని మమ్మల్ని రక్షించింది. అమ్మ అనుగ్రహం లేకపోతే, ఆ అడవిలో నిర్జన ప్రదేశంలో సహాయం ఎలా దొరుకుతుంది? ఇప్పుడు మీకు చెప్పిన అన్ని సందర్భాలలో సహాయం అందించింది ఎవరు? ‘నేనా?’ నా ద్వారా అమ్మ రక్షించింది. నేను అమ్మ చేతిలో ఒక పరికరాన్ని మాత్రమే” అన్నారు శ్రీబాబు. *

# ఆశకి బానిస

– ఆర్.వి. సుబ్రహ్మణ్యం

తను తినడు. ఒకరికి పెట్టడు. కూడబెట్టిన డబ్బునంతా ఇనప్పెట్టెలో బిగించి వుంచి రోజురోజూ చూసి మురిసిపోతూ ఉండే లక్షాధికారి లక్కయ్య . ఇంకా డబ్బు సంపాదించే మార్గం ఎదైనా ఉందా అని ఆలోచన తప్ప వానికి తృప్తిలేదు. ఇనప్పెట్టె తెరిచినప్పుడల్లా 'నాకీ చెర నుంచి విడుదల ఎప్పుడయ్యా' అని మూలుగుతున్న లక్ష్మీదేవి గోడు అతనికి వినబడదు. ఐదు వరహాలు యిస్తానంటే ఆమడ దూరమైనా నడిచి వెడతాడుగాని, కానీ ఖర్చు పెట్టాలంటే ప్రాణం కొట్టుకుపోతుంది లక్కయ్యకి.

ఇలాగ ధనాశ పెచ్చు పెరిగిపోయిన లక్కయ్యకి ఎవరో ఉపదేశం చేసే సరికి అతడు ధనానికి అధిదేవత అయిన కుబేరుణ్ణి గురించి తపస్సు చేశాడు. తనను గురించి తపస్సు చేసే భక్తుడొకడున్నాడని సంతోషించిన కుబేరుడు త్వరలోనే వానికి ప్రత్యక్షమై 'ఏం కావాలో కోరుకో' మన్నాడు. లక్కయ్య మహదానంద భరితుడై వానికి మ్రొక్కి 'నాకింకా ధనం కావాలి స్వామి. ఈ వరాన్ని ప్రసాదించండి' అని అడిగేసరికి కుబేరుడు అది తన చేతిలోని పనే గనుక వెంటనే ఒక బొమ్మను సృష్టించి లక్కయ్యకు యిచ్చి,"ఇది నీ వడిగినంత ధనం యిస్తుంటుంది. కానీ, దానికి ప్రతిఫలంగా నువ్వు ఏదో ఒకటి ఆ బొమ్మకు యిస్తుండాలి సూమా!" అని చెప్పి మాయమయ్యాడు.

లక్కయ్య యింటికి తిరిగి వచ్చిన వెంటనే బొమ్మను పట్టుకుని 'నా కిప్పుడే రెండు గోతాల నిండుగా బంగారు కాసులు కావాలి' అని కోరాడు. తక్షణమే రెండు గోతాలు నిండుగా కాసులతో వాని ముందు ప్రత్యక్షమైనాయి. సంతోషంతో పొంగిపోతున్న లక్కయ్యను 'నాకేమిస్తావు' అంది బొమ్మ. తన యింటికి కాపలాకాసే కుక్కని తీసుకుపొమన్నాడు లక్కయ్య. కుక్క మాయమైంది.

రెండు రోజులు గడిచాక మళ్ళీ బొమ్మని నాలుగు సంచుల నిండా డబ్బు కావాలని అడిగాడు లక్కయ్య. బొమ్మ అలాగే యిచ్చి, తనకేమిస్తావని అడిగింది. అటూ యిటూ చూసి, మంచంలో ఉన్న తన రోగిష్టి తల్లిని తీసుకుపొమన్నాడు. తల్లి మాయమైంది. ఇనప్పెట్టె నిండింది. నాలుగురోజులు తరువాత 8సంచుల నిండా వజ్రాలు అడిగి, ప్రతిఫలంగా ముసలి తండ్రిని మందులిప్పించక్కర్లేకుండా యిచ్చేశాడు. ఇలాగ డబ్బు చేరుతుంటే భోషాణం తెచ్చి దాన్ని నింపసాగాడు. బొమ్మ కోరిన విధంగా తన డబ్బులో వాటా అడుగుతాడని తన తమ్ముణ్ణి, పెళ్ళి చేయాల్సివస్తుందని చెల్లెల్ని తన దురాగడాలకు లబలబలాడిపోతున్న భార్యని, ఇలాగ ఎవరు తనకి నచ్చరో వారందరినీ యిచ్చేస్తూ వచ్చాడు.

ధనంతో నిండిన భోషాణంలో యిప్పుడింక పెద్ద గోతాం ధనం పట్టే వెలితి మాత్రమే ఉంది. ఆ ఖాళీని పూరించేంత ధనం యిమ్మని బొమ్మను అడిగాడు లక్కయ్య. ' అయితే నాకేమిస్తావు?' అంది బొమ్మ. "ఆ ధనం నింపితే యింటినిండా డబ్బే ఉందన్న తృప్తి నాకు ఉంటుంది కనుక నన్నే తీసుకో. నాతోపాటు ఆ ధనమంతా తెచ్చుకుని, నీ వెంట వచ్చి అక్కడదంతా అనుభవిస్తాను" అన్నాడు. బొమ్మ పకపకా నవ్వింది. "మూర్ఖుడా! ఆశకి బానిసవై సర్వం పోగొట్టుకున్న నీకు మిగిలిందేమిటి? ఆ డబ్బు కాదు, అది నీవెంటరాదు. మరణానికి సుంకంచెల్లించిన నువ్వు వట్టిచేతులతో కాలగర్భంలో కలిసిపోతున్నావు" బొమ్మ లక్కయ్యతో మాయమైపోయింది.

*

గత సంచిక తరువాయి

# ఆచార్యదేవో భవ!

-ఎ. సాంబయ్య

గురుదేవులు మన విశ్వాసము సడలకుండా ఉండటానికి మనలను మాయలో పడవేస్తూ, పరీక్షిస్తూ, రక్షిస్తూ, వారి అనుగ్రహంతోనే తిరిగి మనలను మార్గంలో పెడుతూ ఉంటారు. మాతాజీవారు అప్పుడప్పుడు 'నాకు కూడా మీలాగే ధ్యానంలో చిత్రవిచిత్రాలు కలుగుతుంటాయి' అనే మాయ మాటలు ఏవీ నమ్మవద్దు. మనముందు ఆసీనులై ఉన్నది సాక్షాత్తు జగజ్జననియే అనే భావనలో ఉండి అమ్మ బోధా శ్రవణం చేయాలి. నవ్య నవనీతమైన అనగా ఇప్పుడే తీసిన వెన్న ఎంత మెత్తగా ఉంటుందో అటువంటి మృదువైన హృదయంగలవారు నా గురుదేవులు శ్రీమాతాజీ.

కృతయుగంలో మహాతప స్సంపన్నులైన సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులనే నలుగురు ఋషులు పరిపూర్ణ వైరాగ్యంతో సద్గుణ సంపన్నులై, సత్వ ప్రధానులై గురుకృప లేనిదే బ్రాహ్మీ స్థితిని పొందజాలమని గ్రహించి, ఆచార్యేంద్రుడైన దక్షిణామూర్తివారి సన్నిధిని చేరగానే అర్హత కలిగిన ఆ ముముక్షువులను మౌనంతోనే దర్శనమాత్రం చేతనే స్వస్వరూప అనుసంధాన స్థితికి చేర్చి బ్రహ్మవేత్తలుగా మార్చాడు. ఇది కృతయుగం నాటి గురుశిష్య విధానాన్ని తెలుపుతున్నది.

త్రేతాయుగంలో మానవుడు ప్రకృతి ప్రభావాలకు చేరువయ్యాడు. ప్రకృతిలోని విలక్షణమైన అంశాలు మానవునిలో పరిణతి కలిగించే సంగతులను, గురువరేణ్యుడైన దత్తాత్రేయ స్వామి 24 అంశాల ద్వారా ప్రబోధించారు.

ద్వాపరయుగంలో మానవుడు అధికంగా ఈ ప్రకృతి ప్రభావాలకు లోనయ్యాడు. అప్పుడు వ్యాసభగవానుడు యిక సందేశాత్మక విధానమే తగినదని నిర్ణయించారు.

కలియుగంలో జగద్గురు ఆది శంకరాచార్యులవారు జీవాత్మ పరమాత్మల అభేదమును హరిహరులకు భేదం లేదని బోధించి అద్వైతమత స్థాపన గావించారు.

పరమాచార్యులైన మన గురుదేవులు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవరప్రసాద బాబూజీ మహరాజ్‌వారు మన మధ్యలోనే ఉంటూ ఆ బ్రహ్మ తత్త్వమే గురుతత్వమని చాటి చెప్పి, ఆ భగవత్తత్త్వాన్ని మనందరి హృదయాలలో నాటారు.

శ్రీబాబూజీ మహరాజ్‌వారి అవతార పరిసమాప్తి అనంతరం పూజ్యశ్రీ మాతాజీ రూపంలో శ్రీబాబూజీ దర్శనమిస్తూ, తమ దివ్యబోధలు ఆ రూపంలో మనకి అందిస్తున్నారు. వారు దేశంలో పలుచోట్ల యాగాలలో, సాధు సమ్మేళనాలలో పాల్గొని గురుతత్త్వాన్ని వ్యాప్తి చేస్తున్నారు. విదేశాలలో జరిగే కార్యక్రమాలలో కూడా పాల్గొని సర్వమత సారాన్ని, భారతీయ సనాతన ధర్మాన్ని చాటి చెబుతున్నారు.

మహోత్కృష్టమైన గురుదేవుల ఔన్నత్యాన్ని త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల శాసనాల ద్వారా గురుగీతలో చెప్పిన శ్లోకాలను ఒక్కసారి గుర్తుచేసుకుందాం.

నగురోరధికం నగురోరధికం నగురోరధికం నగురోరధికం ।

శివశాసనతః శివశాసనతః శివశాసనతః శివశాసనతః॥

అనగా శివుని శాసనము వలన గురువు కంటే అధికమైనది ఈ విశ్వంలో ఏదీ లేదు.

ఇదమేవ శివం, ఇదమేవ శివం, ఇదమేవ శివం, ఇదమేవ శివం।

హరిశాసనతః హరిశాసనతః హరిశాసనతః హరిశాసనతః ॥

అనగా హరి సాక్షిగా గురుదేవుడే శివుడు అని హరి శాసించాడు.

విదితం విదితం విదితం విదితం

విజనం విజనం విజనం విజనం

విధిశాసనతః విధిశాసనతః విధిశాసనతః విధిశాసనతః॥

అనగా ప్రపితామహుడు బ్రహ్మ శాసనమువలన అద్వితీయమగు శ్రీగురురూపము ఈ విధంగా ప్రకటించబడినది అని.

సాక్షాత్తు జగజ్జననియే శ్రీబాబూజీ మరియు శ్రీమాతాజీ రూపంలో మానవ దేహంతో మన ముందుకు వచ్చి వారి బోధామృతంతో మనలను ముక్తిమార్గంవైపుకి నడిపిస్తుంటే మనకు దిగులెందుకు? మనమంతా ఆచార్యుని బోధలకు స్పందిస్తూ, మంత్రోపదేశాలను ఉపాసిస్తూ సాధనచేయటమే మన ధర్మం.

*



దేవముని ప్రవరార్చిత లింగం

కామదహన కరుణాకర లింగం

రావణదర్ప వినాశక లింగం

తత్ప్రణమామి సదాశివలింగం

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

25వ శ్లో॥ కారుణ్య కర్బుర కటాక్ష నిరీక్షణేన
తారుణ్య సంవలిత శైశవ వైభవేన
అపుష్ణతా భువన మద్భుత విభ్రమేణ
శ్రీకృష్ణచంద్ర! శిశిరీ కురు లోచనం మే.



తాత్పర్యము -

ఓ కృష్ణ చంద్రా ! దయా రసముచేత చిత్ర వర్ణమైన క్రీగంటి చూపులు గలది, ఆశ్చర్యము అద్భుతమైన విలాసములు గలది కనుకనే జగత్తును బాగుగా రక్షించుచున్నది. యౌవనారంభముతో కూడిన బాల్యవైభవము చేత నా నేత్రమును చల్లగా చేయుమా!

చాలా సేపు వాకిట్లో నిలబడి ఎదురు చూశాను. వేళకాలేదేమో యింకా! ఇంట్లోకి వచ్చేసి పెరట్లో పనేదో చూసుకుంటున్నాను. ఆవేళలో అంతదాకా నిశ్చలంగా ఉన్న ప్రకృతిలో కదలికి కలిగినట్లు కమ్మని గాలితెర చల్లగా వీస్తూ ఒంటికి తగిలింది. ఒక పిల్ల తెమ్మెర పారిజాతం కొమ్మలపైన గుత్తులు గుత్తులుగా పూసిన పూలను తాకినందుకు కాబోలు అవి ఒకటే తలులూపుతున్నాయి.చెట్లమీద పిట్టలన్నీ ఏవో పలుకుతున్నట్లు కిలకిలమని రొదన చేస్తున్నాయి. మందార పుష్పం ఒకటి ఎర్రని నోరు తెరచి ఏదో చెబుతున్నట్లున్నది.పాకలో రాటకి కట్టిన గోవు గోముగా అమ్మా! అని అరచింది. ఆ క్షణంలోనే చందన కస్తూరి పరిమళాలు గుప్పుమంటూ వచ్చి నన్ను చుట్టుకున్నాయి. నా కంటె ముందు వార్త ఆ జీవాలన్నిటికి అందిందా! చప్పున చేతిలో పని వదిలి నట్టింట్లోకి వెళ్ళాను.

ఎప్పుడొచ్చాడో! చేతినిండా, మూతినిండా వెన్న. బానలో పిసరంతైనా ఉంటే ఒట్టు! నీలాకాశంలో తళుక్కున మెరిసే చుక్కల్లాగ నల్లని బొజ్జనిండా వెన్న తుంపరలు. చూడటానికి రెండు కళ్ళూ చాలటంలేదు. చిత్రంగా మెరిసే కంటికొనల చూపులు నన్నల్లుకున్నాయి. పక్కున నవ్వాను.

'నవ్వుతావేమి? నేను చేసిన దొంగపనికి నీకు కోపం రావటం లేదా?' అన్నాడు నందబాలుడు బెదురుతున్నట్లు. తమ తమ ఇళ్ళలో పాలుపెరుగు దొంగిలించినట్లు చెబుతుంటే విని రాధమ్మ అంటుంది "ఈ వ్రేపల్లెకు నందగోపుడు రాజు ఎలాగో అలాగే యీ ప్రపంచమంతటికీ ప్రభువు కృష్ణుడు. పుట్టించి, పెంచి, త్రుంచేవాడు వాడే. ఇక్కడి ప్రతి వస్తువూ ఆయన స్వంతం. అడిగీ, అడగకా అన్నీ తీసుకునే అధికారం ఆ

బుల్లిరూపంలో కనిపించే జగదీశ్వరునికే ఉంది" అని. ఆ మాటలు గుర్తువచ్చి అన్నాను నేను "అన్నీ నీవే అయినప్పుడు నీది నీవు తీసుకోవటంలో నేరమేమున్నది? నిన్ను దొంగ అనరు, సర్వాధికారి అంటారు".

"ఓహో! ఈ పెద్దమాటలు ఎక్కడ నేర్చావు?" అన్నాడు. నా చీరె చెంగుతో వెన్నతిన్న చేతిని మూతిని తుడుచుకుంటూ. పెదిమిల వెనుక నవ్వును ఆపుకుంటూ. "రాధమ్మ లేదూ! నీ గురించి మాకు తెలియని విషయలన్నీ ఆవిడే మాకు చెప్తుంటుంది. సరేనా!" అన్నాను.

"మీ అందరికీ నాయకురాలన్నమాట! అవన్నీ నిజమనుకునేవు. నమ్మకు చెడిపోతావు" అన్నాడు కృష్ణుడు. మొహంలో అమాయకత్వం లేదిప్పుడు. "చెడిపోము, బాగుపడతాము.ఆవిడ యమునానది అంత లోతైనది జ్ఞానంలో " అన్నాను నేను దృఢంగా. "మరి నువ్వో?" అన్నాడు వెక్కిరిస్తూ. "ఇప్పుడిప్పుడే నదిలో పుడుతున్న చిన్న అలని కన్నయ్యా! " అన్నాను.

"ఏమో! ఆ గోలంతా నాకెందుకు గానీ, అన్నీ నావే అన్నావుగా, నేనడిగింది యిచ్చేస్తానన్నట్లే కదా, కనుక ఈ పెరుగు పిడత తీసుకుపోతున్నాను. మధ్యాహ్నం మా అందరి కడుపు నిండా పెరుగన్నం" అంటూ రివ్వున దూసుకుపోయాడు కృష్ణుడు.

గోవులని తోలుకుపోయేటప్పుడు పెరుగన్నం యిద్దామని గుమ్మంలో కాచుకు కూర్చుంటే రాలేదు. ఇప్పుడు తనే వచ్చి తీసుకుపోయాడు. నా పని తేలికైంది కదా! అయినా మనసులో మాట ఇంత సులువుగా పసికట్టేవాడా ఈ పసిబాలుడు! ఆలోచనలో పడ్డాను.

– సశేషం

# శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి కాగుపాడు బేబమ్మగారు 8-11-2012 గురువారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 78 సంవత్సరాలు. వీరికి ఒక కుమార్తె, అల్లుడు, మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, ముని మనుమరాండ్రు కలరు. వీరు తమ నేత్రములను దానంచేసిన ధన్యజీవులు! సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరుగాక!

వీరు కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము.

# పరిప్రశ్నేన సేవయా

– పరాశర ప్రసాద్

సగుణ భక్తి గొప్పదా? నిర్గుణ భక్తి గొప్పదా? అని లేవనెత్తిన ఒక భక్తుని ప్రశ్నకు సమాధానంగా సద్గురుమూర్తి అందించిన దివ్య సందేము.

"భక్తి సగుణమైనదే. విశ్వాసము నిర్గుణమైనది. సాధకుడు ఎవరైనా ముందుగా ఒక పూజా మందిరాన్ని ఏర్పరచుకుని పూజ, అలంకరణ, అర్చన అలవరచుకుంటాడు కదా! అది భక్తిని పెంపొందింప జేస్తుంది.



ధ్యానము సగుణమైనదే. ధ్యానము ద్వారా పొందే అనుభూతులన్నీ మనస్సు ద్వారా పొందేవే కాబట్టి అవన్నీ సగుణమైవే. వేదాంత గ్రంథాలు, పురాణాలు, భక్తుల చరిత్రలు చదివి, భక్తిని పెంపొందించుకోవచ్చు. సంకీర్తనలో పాల్గొన వచ్చును. నామస్మరణ చేయవచ్చు. పురాణశ్రవణం చేయవచ్చు. ఇవన్నీ ఎన్ని చేసినా సద్గురుమూర్తి ఆశ్రయం లభించనిదే భక్తిగాని, విశ్వాసంగాని బీజదశలోనే ఉంటాయి సుమా!

సద్గురుమూర్తి ఆశ్రయం సిద్ధించిన తరువాత బీజము అంకురించి శాఖోపశాఖలై విస్తరించి పరిపక్వస్థితికి చేరుతుంది. సద్గురుమూర్తి బోధ శ్రవణం చేసి, మననం చేస్తాడు. శ్రవణం సగుణము. మననము నిర్గుణం. శ్రవణం చేయకుండా మననం చేయలేడు కదా! కాబట్టి సగుణ భక్తి, నిర్గుణ స్థితికి తీసుకు వెళ్తుంది.

శ్రీకులశేఖరాళ్వారు భగవంతుని ప్రార్థిస్తూ ఎన్ని జన్మలెత్తినా, ఏ ఉపాధితో కూడిన జన్మని ప్రసాదించినా, భగవంతుని దివ్యచరణారవిందముల యందు అచంచల భక్తిని ప్రసాదించమని కోరుకున్నాడు. నిజమైన భక్తుడు కోరుకునే సారూప్యమైనా, సాన్నిధ్యమైనా, సాయుజ్యమైనా సరే ఆనందాన్నివ్వదా?

భగవంతుని తన మనస్సులో నిలుపుకున్నా, లేక తన మనస్సుని భగవంతుని యందు నిలిపినా తేడా ఉందా! అమృతములో మునిగినవానికి, అమృతము గ్రోలినవానికి తేడా ఉందా! విశ్వరూప సందర్శనము పొందిన అర్జునుడు సగుణభక్తి గొప్పదా? నిర్గుణ భక్తి గొప్పదా? అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా శ్రీకృష్ణభగవానుడు 'నిరంతరము ఎవరైతే మనస్సు నాయందే నిలిపి ఉపాసన చేస్తారో వారు గొప్పవారు' అని చెప్పాడు కదా! నిజమైన భక్తుడు సంసారియైనా, సన్యాసి అయినా బ్రహ్మచారి అయినా మనస్సు భగవంతుని దివ్యచరణారవిందాలయందు నిలిపి ఉంచాలి" అన్నారు శ్రీబాబు.

*

# వైద్య విధానానికి ఆవల - ధ్యానము

- డా॥ సుంకర ప్రసాద్ **U.S.A**

డాక్టర్ సుంకర ప్రసాద్ గారు శ్రీ బాబూజీ మహరాజ్ సన్నిహిత భక్తులు అమెరికాలో "**వైద్య విధానానికి ఆవల - ధ్యానము**" అంశం పై తమ సందేశాన్ని న్యూస్ లెటర్ ( ది. స్కోప్ - ప్రొనినా కోవనెంట్ మెడికల్ కార్నర్ - అక్టోబర్ 2012) ద్వారా అక్కడ వైద్య సేవలను అందిస్తున్న వైద్యులకు, నర్సులకు. తదితర సిబ్బందికి అందించారు. దాని తెలుగు అనువాదం ఇక్కడ ప్రచురిస్తున్నాము - ఎడిటర్

***వైద్య విధానానికి ఆవల - ధ్యానము***

"ధ్యానం అంటే ఏమిటో సులభంగా చెప్పాలంటే - భగవంతునిపై మనస్సును ఏకాగ్రం చేయటం. మనమంతా రోగులకు స్వస్థత చేకూర్చే ఉత్కృష్ట సేవాకార్యంలో వున్నాము. డాక్టర్లు, నర్సులు, తదితర స్టాఫ్ మెంబర్లమందరమూ కలిసి ఈ రోగనివారణ మహోద్యమంలో పాల్గొన గలగటం మన అదృష్టం. మనం మన వైద్యవిజ్ఞానం,తదితర కౌశలాలతో పాటు ధ్యానాన్ని కూడా మేళవిస్తే, అది మనకి, రోగులకు ఎంతో మేలు చేస్తుంది.

ధ్యానం అంటే ఏమిటి? ధ్యానం ఎందుకు చేయాలి? దానివల్ల వచ్చే లాభం ఏమిటి? అన్న విషయం గురించి చెప్పాలి అంటే - ఎందరో యోగి పుంగవులు హిమాలయాలలో వేల సంవత్సరాల కొలదీ ఈ ధ్యాన ప్రక్రియను చేస్తూ ఉన్నారు. నా గురుదేవులు శ్రీ బాబు (శ్రీహనుమత్కాళీ వర ప్రసాద్ బాబూజీ మహరాజ్ వారు) నన్ను ప్రతి రోజూ తెల్లవారు జామున గం.4.30ని.లనుండి గం.5 వరకు "ఓం" అనే ప్రణవాన్ని నియమం తప్పకుండా మానసికంగా ధ్యానం చేయమని 1982 వ సంవత్సరంలో నాకు చెప్పారు.

మనలో ఉండే లోభ మోహాలు. కామ క్రోధాలు, ఈర్ష్యాసూయలు ఒక ఇంట్లో గుమి కూడిన భూతాలు, తేళ్ళు పాములవంటివి. వీటితో కూడిన మనస్సు మానవుని కష్టాలకు దుఃఖాలకు, గురి చేస్తుంది. మనస్సును నిర్మలం చేసుకోవాలంటే వీటిని ధ్యానమనే అగ్నిలో వ్రేల్చాలి. ఈ ధ్యానాగ్నిలో చెడు సంకల్పాలు, పాప కర్మలు దహింపబడి మనస్సు పవిత్రత చెందుతుంది.

అలా పవిత్రత చెంది భగవంతుని వైపు తిరిగిన మనస్సు జగత్తులోని అన్ని జీవరాసులలో మంచినే చూస్తుంది. మంచినే గ్రహిస్తుంది. మనస్సే అన్ని సంకల్పాలకు మూలము. శుద్ధ మనస్సులో మంచి సంకల్పాలు వస్తాయి. అశుద్ధ మనస్సులో చెడు సంకల్పాలు వస్తాయి. అశుద్ధ మనస్సు మానవుడిని పతనం చేస్తుంది.

భగవంతుడు దయా స్వరూపుడు. ప్రేమ స్వరూపుడు. ఆర్త త్రాణ పరాయణుడు. పుత్రుడు కౌగిట చేరితే తండ్రి ఎంతాగానో మురిసిపోతాడు. పులకించిపోతాడు. భగవంతుడి ప్రేమ ఈ లౌకిక పుత్రులపై చూపే ప్రేమ కన్న ఎంతో గొప్పది సాటి లేనిది. ఇట్టి ప్రేమానురాగాలు నేను నా గురుదేవులు శ్రీబాబు వద్దనుండి పొందాను.

మనం ఈ ధ్యానం చేయటం అలవాటు చేసుకుంటే మన జీవితాలలో, సుఖ శాంతులు వెల్లి విరియటమే కాక ఇతరులందరికీ కూడా శాంతి సౌఖ్యాలు లభిస్తాయి.

మనం చేసే వైద్యానికి ధ్యానం తోడైతే ఎటువంటి రోగాన్నైనా నయం చేయవచ్చు. అయితే అట్టి విశ్వాసం మనలో దృఢంగా ఉండాలి. ధ్యానం యొక్క విశిష్టత తెలుసుకోవటానికి ఒక ఉపమానం ఇస్తాను - మీరు గూగుల్ సెర్చ్(Google Search)లోకి వెళ్ళి "త్రైలింగస్వామి" గురించి వెతికితే 'ఈయన ఈ యోగాభ్యాసం వల్ల 280 ఏళ్ళు జీవించి 1888లో సమాధి పొందార'ని మీకు తెలుస్తుంది. ఇది నమ్మశక్యం కాదు. కాని ఇది అక్షరాల నిజం. కాబట్టి ధ్యానం వల్ల, సకారాత్మక దృక్పథం వల్ల మానవుడు దివ్యోన్నత శిఖరాలకు చేరుకోవచ్చు.

( ఈ సందేశాన్ని చీఫ్ మెడికల్ ఆఫీసర్ , మరియు మెడికల్ స్టాఫ్ ప్రెసిడెంట్ అక్కడ పనిచేసే డాక్టర్లకీ, నర్సులకీ తదితర స్టాఫ్ మెంబర్లందరికీ న్యూస్ లెటర్ వెనుక ప్రింట్ చేసి పంపించారు దీనిద్వారా వారందరూ "ధ్యానం- దాని ఆవశ్యకత" గురించి తెలిసికొన్నారు)

*

# శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి మందడి రమణమ్మగారు (కట్టమూరు) 23-10-2012 మంగళవారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 73 సంవత్సరాలు. వీరికి నలుగురు కుమారులు, కోడళ్ళు, మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, ముని మనుమరాండ్రు కలరు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరుగాక!

వీరు కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము.

# స్థిత ప్రజ్ఞుడు

- పరాశర ప్రసాద్

(108 శ్రీదండి నిర్మలానంద స్వామి ప్రసంగ సారాంశము)

ఆపిల్ పండుని ఎదురుగా ఉంచుకుని ఎవరైనా ఆపిల్ పండు ఎలా ఉంటుంది? అని ప్రశ్నించటం సమంజసమేనా? అలాగే కృష్ణభగవానుని అర్జునుడు ప్రశ్నించాడు. స్థిత ప్రజ్ఞుడు ఏరీతిగా ఉంటాడు? ఆయన లక్షణాలు ఏమిటి? ఆయన పలుకులు ఎలా వుంటాయి? ఆయన ఎలా సంచరిస్తాడు?' అని అడిగాడు.సంక్షిప్తంగా చెప్పాలంటే స్థితప్రజ్ఞుడి వాక్కు , నడక, నివాసము గురించి అడిగాడు. అర్జునుడు సద్గురుమూర్తి దగ్గర ఎలా సంచరించాలో ఆ విధంగా అనుసరించాడు. మనస్సులో మాటని నోటితో చెప్పాడు. చెప్పింది ఆచరించాడు. అంతకన్న ఏమికావాలి?

భగవద్గీతలో శ్లోకం శోకాన్ని దూరం చేస్తుంది. అంతేకాదు నిర్భయత్వాన్ని బోధిస్తుంది. భయస్థులు క్షణక్షణమూ పుడుతూ, చస్తూ ఉంటారు. మానవుడిని పతనం చేసేది అహంకారము. అహంకారము వలన యుక్తాయుక్త పరిజ్ఞానాన్ని కోల్పోతాడు. ఏది ధర్మము ఏది అధర్మము అనే విషయాన్ని మరచిపోతాడు.

పొరపాటు చేయవచ్చు. దాన్ని తెలుసుకున్న తరువాత నశింపజేసుకోవాలి. వంగే కర్రని శుభప్రదమైన కార్యాలకి ఉపయోగిస్తారు. వంగని కర్రని శవాలు మోయటానికి వినియోగిస్తారు. వినయవిధేయతలు కలిగిన వ్యక్తి పెద్దల సమక్షంలో తలవంచుతాడు. శిరస్సు వంచితే శివము. వంచకపోతే శవమే కదా!

వినయ విధేయతలు కలిగిన శిష్యుడు గురుమూర్తి అనుగ్రహానికి పాత్రుడు. సద్గురుమూర్తి దగ్గర తలవంచటానికి దేహాభిమానం అడ్డువచ్చినా, మంగలివాని దగ్గర క్షురకర్మ చేయించుకునేటప్పుడు తల వంచక తప్పదు కదా!

అహంకారం రహితం కానిదే జ్ఞానము నిలవదు. ఆత్మానాత్మ వివేకము కలగాలంటే శుద్ధమైన బుద్ధి కావాలి. అద్దంలో నీ ప్రతిబింబం గోచరించాలంటే అద్దము ఉపరితలము పరిశుభ్రంగా ఉండాలి కదా! ఆత్మ సర్వవ్యాపకమైనదైనా, శుద్ధమైన బుద్ధిలేని అవివేకి దర్శించలేడు. మైలబుద్ధిగాని, మోహబుద్ధిగాని, రజోగుణ, తమో గుణ సంబంధమైనవి. బుద్ధిలోని మాలిన్యాన్ని తొలగించటానికి నిష్కామకర్మ చేయాలి.

కర్మయోగం గురించి ప్రబోధం చేయటానికి ఒక పండితుని ఆహ్వానించారు. పూలహారంవేసి, ఆపిల్‌పండ్లతో సత్కరించారు. నిష్కామకర్మ గురించి అనర్గళంగా వుపన్యసించారు. తీరా యింటికి వెళ్ళాక ఆపిల్ పండు చూసి మోహం జనించింది. ఎంత బాగున్నాయో, ఎక్కడ కొన్నారో? తిరిగి వాటిని పొందాలని ఆకాంక్ష కలిగింది.

అదే వాసన. కర్మ చేయాలి కాని, ప్రతిఫలాన్ని ఆశించరాదు. నిష్కామ కర్మ వలన బుద్ధి సూక్ష్మం అవుతుంది. స్థూల బుద్ధికి ప్రపంచమే గోచరిస్తుంది.

స్థిత ప్రజ్ఞుడు ఎలా ఉంటాడు? సమాధిలో ఉంటాడు. అంటే అది జ్ఞాన స్థితి. అక్కడ బీజాలు ఉండవు. అదే జ్ఞాన సమాధి. యోగసమాధి ప్రయత్నంతో వస్తుంది. అప్రయత్నంగా వచ్చేది నిద్ర. ఈ రెండు అవస్థలలోను వాసనలుంటాయి. జ్ఞానానికి జగత్తు తన స్వరూపమే.

పొలంలో ఎద్దుని వదిలిపెట్టారు. అది స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటుంది. ప్రమాదం లేదు. పొలం అంతా తనదే. ఇంకొక వ్యక్తి పొలంలో ఎద్దుని త్రాడుతో బంధించారు. ఎందువలనంటే తన పొలంలోనే ఉండాలి. ప్రక్క పొలంలోకి వెళితే ప్రమాదం. ఇక్కడ పరిమితి ఉంది. నీది నాది అనే భేదం ఉంది. స్థితప్రజ్ఞుడు సమాధిలో ఉండటం సమాధినుంచి లేవటం అనేవి ఉండవు. స్థితి అంటే చలనము లేనిది లేక కదిలికలు లేనిది అని అర్థం. అంటే జడము అని కాదు. బుద్ధి సమస్థితిలో ఉంటుంది. ప్రజ్ఞ స్థిరమైనది. మార్పులేనిది.

-సశేషం

మేక - తోడేలు

ఒక అరణ్యంలో ఒక మేక 'మే, మే, మే' అని అరుస్తూ పోతుండగా, ఆ శబ్దాన్ని విని సుదూరాన ఉన్న ఒక తోడేలు పరుగు పరుగున వచ్చి ఆ మేకను చంపి తినివేసింది.

ఈ ప్రపంచంలో జీవుడనే మేక 'ఈ దారా పుత్రులు నావారు, ఈ బంధువులు నా వారు' అని ఈ ప్రకారముగా కేలేస్తుండగా ఇంతలో మృత్యువనే తోడేలు ఎక్కడినుంచో చల్లగా వచ్చి జీవుడనే మేకను తన పొట్టన బెట్టుకుంటుంది. ఈ విషయము గరుడ పురాణమందు ఈ ప్రకారంగా వర్ణింపబడి ఉన్నది.

***అపత్యం మే కళత్రం మే । ధనం మే బాంధవాశ్చ మే ।***
***జల్పన్తమితి మర్త్యాజం । హన్తి కాలవృకో బలాత్ ॥***

(సంస్కృతంలో 'మే' అనగా 'నాది', 'నాకు చెందినది అని అర్థము) నా పుత్రుడు, నా భార్య, నాధనము, నా బంధువులు అని గొప్పగా చెప్పుకొనుచు, 'మే, మే' అని అరుస్తున్న మానవుణ్ణి మృత్యుదేవత తన వశముమొనర్చుకుంటున్నది అని ఈ శ్లోక అర్థము.

***నీతి - మృత్యువను తోడేలు రాకపూర్వమే జీవుడను మేక జీవితము కడతేరుటకు దారిని వెతకవలెను. భగవంతుని తెలిసికొనుటకు ప్రయత్నించవలెను. స్వస్వరూప జ్ఞానమును బడయవలెను.***

– శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామి

# విశ్వాసమే రక్ష

-జి.వి. రత్నం

అట్టి జ్ఞాన రత్నము ఏకాగ్రమైన ధ్యానము వలనే లభిస్తుంది కాని, లెక్కపెట్టుకుంటూ జపమాల త్రిప్పితే రాదు. నిర్విరామంగా ఏకతైల ధారవలె ధ్యానం జరగాలి. ఇలా అనగానే సందేహం వస్తుంది. 'గృహస్థుని కదా! స్వధర్మం ఆచరించాలి కదా! ధనం సంపాదించి, దారాపుత్రాదులను పోషించాలి కదా! అతిథి అభ్యాగతులను ఆదరించాలి కదా! ఇవన్నీ కూడా ముఖ్యమని వేదాలే చెబుతున్నాయి కదా! మరి లెక్కగా చేస్తే చాలదని తైలధార వలె ఆపకుండా ధ్యానం చేయాలని అంటే కాలమంతా వినియోగిస్తే ఎలా?'



దానికి భగవంతుడు యిలా సమాధానం చెప్పాడు. "నీ స్వధర్మం తప్పకుండా ఆచరించు. సోమరితనం రానీయకు. కర్మచెయ్యి. మనస్సు నాపై ఉంచు. ఫలితం నాకు వదిలెయ్యి" ఏ పని చేస్తున్నా, భగవంతుని యందు విశ్వాసం నిలిపితే 'నారాయణా!' అనో 'శంకరా!' అనో, 'అమ్మా!' 'గురురాం!' అనో అనంతకోటి నామాలలో ఏదో ఒక యిష్టమైన నామం తెలియకుండానే అనుకుంటూ ఉంటాడు. అదే చాలు. 'నారాయణ' అంటే నానత్వం హరిస్తుంది. 'శంకర' అంటే సంకటాలు తొలగిపోతాయి. 'అ' బ్రహ్మాబీజం, 'మ' అమృతబీజం. కనుక 'అమ్మా!' అంటే బ్రహ్మామృతం అందుతుంది. 'గురురాం' అంటే 'గు' అంటే అజ్ఞానాంధకారం నశించి, 'రు' అనే జ్ఞానతేజస్సు ప్రకాశిస్తుంది. మనస్సు దేని యందు నిలిపితే దాని రూపాన్నే ధరిస్తుంది. మనస్సును విషయ వాంఛ అనే చేదులో వేస్తే చేదుగా మారి, కాలునిబారిన పడేస్తుంది. బ్రహ్మామృతమనే తీపిలో నానవేస్తే మధురంగామారి, మధురాధిపతిని చేస్తుంది.

అంత్యకాలంలో మనస్సు దేనియందు నిలిస్తే మానవునికి మళ్ళీ ఆ జన్మ వస్తుంది అంటారు. ఇది నిజమే. అందుకనే అంత్యకాలంలో హరినామ స్మరణ చేయాలంటారు. కాని, మరణ వేదన చాల దుర్భరం. అట్టి సమయంలో కూడా ఆ స్మరణ నిలవాలంటే, మనస్సుని ఆ స్మరణయందే నిలపటం అలవాటు చేసుకోవాలి.

గురుప్రేమ గొప్పది. గురువునకు పరమాత్మకు భేదం లేదు. సత్యగురువు మనలను సంసార పంకం నుండి ఉద్ధరించ గలడు. అయితే ఆయన చెప్పినదాన్ని విశ్వాసంతో ఆచరించాలి. అలా ఆచరించినప్పుడు కీటకం భ్రమరంగా మారినట్లు, శిష్యుడు కూడా గురుస్వరూపుడై ప్రకాశిస్తాడు. గురువే శిష్యుడు, శిష్యుడే గురువు అన్నదానికి ఇదే తార్కాణం.

అప్పుడే గురువు 'త్వమేవాహం' (నీవే నేను) అని తన శిష్యుణ్ణి సంబోధిస్తాడు రూపాలు వేరుగాని, వారి మనుస్స ఒక్కటే. అది శుద్ధ మనస్సు. అలా శుద్ధంగా మారిన మనస్సు తిరిగి ఎన్నడూ మలినం కాదు. మానవునిలో జ్ఞానాగ్ని దాగి ఉంది. ఆ మానవుడు ఎన్నాళ్ళు సంసార సముద్రంలో మునిగి ఉన్నా, ఆ అగ్ని ఆరేది కాదు. గురు లక్ష్యార్థంతో అతని మనస్సును ధ్యానం ద్వారా రాపిడి పెడితే, అతనిలోని జ్ఞానాగ్ని ప్రజ్వలించి, సర్వకర్మ బీజాలను, అవిద్యా, అజ్ఞానం అనే అరణ్యాన్ని దగ్ధం చేసి, అందులో ఉన్న కామక్రోధాది

దుష్ట జంతువులను పారద్రోలి శుద్ధ మనస్సుగా మార్చి నిరాకార, నిరామయ, నిరావరణ, నిర్వికార, నిర్వికల్ప నిరంజన, నిత్య సత్యమైన ఆత్మ రూపంగా చేయగలుగుతుంది.

అట్టి జ్ఞానం ప్రసాదించగలవారే సత్యగురుదేవులు. వారు అఖండ జ్యోతి స్వరూపులు. గోకులంలో యశోదమ్మ యింట్లో వెలిగిన జ్యోతి అటువంటి అఖండ జ్యోతి. ఆ జ్యోతికి ఎవరు తమ దీపాలను తెచ్చి వెలిగించుకుంటే వారి యిళ్ళు చీకటి తొలగి వెలుగుతో ప్రకాశిస్తాయి. అటువంటి యింట్లో హాయిగా ఉండవచ్చు. చీకటి యింట్లో భయం. ఏదైనా తగిలి క్రిందపడి దెబ్బలు తగలవచ్చు. పురుగు పుట్ర కుట్టవచ్చు. దీపం వెలిగించుకుంటే అన్నిటినీ స్పష్టంగా చూడవచ్చు. అపాయాలను తప్పించుకుని, వుపాయంగా కావలసిన వస్తువును పొందవచ్చు.

అజ్ఞానానికి, వివేకానికి అదే తేడా. ముఖ వర్చస్సులోనే తేడా తెలిసిపోతుంది. అజ్ఞాని ముఖం కొరకంచు ముఖం. జ్ఞాని ముఖం నిర్మల కాంతులతో వెలిగే దీపం! ఆ వెలుగులో ప్రవేశించిన ఏ మానవుడైనా తానెవరో తాను తెలుసుకుని తరించగలడు! అట్టి జ్ఞానాన్ని అందించి, తరింపజేయగల మహాత్ములెందరో ఉన్నారు. భగవద్గీతలో ఒక్కొక్క అక్షరానికి, ఒక్కొక్క మహాత్ముడు ఉద్భవించి, సందేశాన్ని తాము ఆచరించి, ఆనందాన్ని పొంది, ఆ ఆనందాన్ని అందరికీ అందజేశారు. అట్టి వెలలేని జాతిరత్నాలకు నిలయమైనందువలనే మన దేశం జాతిరత్నం అయింది. ఇక మన మతం సర్వమతాల సారము. అందరినీ ప్రేమించి, అందరికీ సమానంగా శాంతిని, కాంతిని అందజేయగల సర్వసమ్మతమైన మతం మన హిందూమతమే.

డ్రింకు పుచ్చుకుంటే తాత్కాలికంగా దేహతాపాన్ని మాత్రమే తీరుస్తుంది. ఎక్కువగా పుచ్చుకుంటే ఆరోగ్యం చెడి, ఒళ్ళు గుల్ల అవుతుంది. నీ సంపద నశిస్తుంది. యశస్సు హరిస్తుంది. కాని, రామరసాయనం పుచ్చుకుంటే యింద్రియతాపాలు హరించి, మనస్సుకి సుఖశాంతులు కలుగుతాయి. ఎంత పుచ్చుకున్నా యింకా తీసుకోవాలి అనిపిస్తుందేకాని, ముఖం మొత్తదు. రోగం రాదు. శరీరానికి, మనస్సుకి పుష్టి, తుష్టి, బుద్ధిబలం వృద్ధి చెందుతుంది. ఆ రసాయనం మనలోని కలుషాలన్నిటినీ ఫిల్టర్ పట్టి తీసివేసి, శుద్ధి చేస్తుంది. ఆత్మానందంలో ఓలలాడిస్తుంది. ఆ రసాయనం సేవించటం వలనే మారుతి జితేంద్రియుడయ్యాడు. పోతన, త్యాగయ్య, రామదాసు, కబీరు మొదలైన మహాభక్తులెందరో ఆ రసాయనం సేవించి తరించారు.

ఆ రామ పాదుకలే 'బాబు!' అనే యీ షర్టు ధరించి, ఈ సందేశాన్ని మీకందజేస్తున్నాయి. అంతేకానీ నేనేమీ భగవంతుణ్ణీ కాను, మహాత్ముణ్ణీ కాను. మహాత్ములందరికీ దాసానుదాసుణ్ణి. మీ అందరికీ దాసుడను. ఏమీ చదువుకోని వాడను. జగన్మాత చల్లని ఒడిలో హాయిగా పడుకొని ఆవిడ అందించే జ్ఞానక్షీరాలను గ్రోలే పసివాడను. ఈ గొట్టంలో నుంచి ఆమె ఏది పలికిస్తే అది పలుకుతాను. జగన్మాత వెదజల్లే ఈ జ్ఞానబీజాలు మీ అందరి హృదయ క్షేత్రాలలోనూ నాటుకొని, యీ జన్మలో కాకపోయినా, మరో జన్మలోనైనా, ఏ ఒక్క క్షేత్రంలో నైనా మొలకెత్తి ఫలిస్తే, నా కృషి ఫలించిందని, నేను ధన్యుడయ్యానని, నా జన్మ సార్థకమైనదని భావిస్తాను. గురుపాదుకలు సర్వదా కాపాడు గాక!!

# వరద బాధితులకు సహాయం

ఇటీవల వచ్చిన నీలం తుఫాను వల్ల విపరీతంగా వానలు కురిసి గుంటూరు వద్దనున్న పెదకాకాని మండల ప్రాంతంలో  అనేక గ్రామాలు జలమయమయ్యాయి. రోడ్డు రవాణా సౌకర్యాలు స్థంభించాయి. నవంబర్ 4. 2012న స్థానిక ఎమ్. ఆర్. ఓ శ్రీకాళీవనాశ్రమానికి ఫోన్ చేసి పెదకాకాని మండలంలో ఉన్న ఉప్పాడ, తక్కెళ్ళపాడు గ్రామాలలో వరదలో చిక్కుకున్న వారికి భోజనాలు పెట్టే ఏర్పాటు చేయమని అడిగారు. వారి అభ్యర్థన మేరకు శ్రీ కాళీవనాశ్రమంలోనుంచి యువసమితి సభ్యులు వెంటనే కార్యరంగంలోకి దిగి వంటలు వండించుకొని ఆ గ్రామాలకు వెళ్ళి అక్కడి వరద బాధితులకు భోజనాలు పెట్టారు. అక్కడి స్థానిక పంచాయతి ఆఫీసు స్టాఫ్, వి. ఆర్.ఓలు యువజన లభ్యులతో కలిసి వరద బాధితులకు సకాలంలో ఆహారం అందించటంలో సహాయం చేశారు. ఆ గ్రామవాసులందరూఎంతో సంతో షించారు.

జలమయిన తక్కెళ్ళపాడు, ఉప్పాడ గ్రామాలు






తక్కెళ్ళపాడు గ్రామంలో వరదబాధితులకు భోజనాలు పెడుతున్న యువ సేవా సమితి సభ్యులు - శ్రీ కాళీవనాశ్రమం నంబూరు







తక్కెళ్ళపాడు గ్రామంలో వరదబాధితులకు భోజనాలు పెడుతున్న యువ సేవా సమితి సభ్యులు







ఉప్పాడ గ్రామంలో వరదబాధితులకు భోజన వితరణ చేస్తున్న యువ సేవా సమితి సభ్యులు - దృశ్యాలు.

– సి.వి. నారాయణ రావు

## అక్షితల మహిమ

26.10.2012న శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో జరిగిన శ్రీ సద్గురుదేవుల పాదపూజా మహోత్సవం సందర్భంగా శ్రీ నారాయణ ప్రసాద్ గారు, పూజానంతరం ఇచ్చే మంత్రాక్షతలు, కుంకుమ, పుష్పాల మహిమను గురించి తమకు కలిగిన స్వానుభవాల గురించి చెప్పారు. ఆ ప్రసంగ వివరణ వారి మాటలలో :

శ్రీబాబూజీ మహరాజ్ వారితో పరిచయం ఏర్పడుతున్న రోజులవి. 1969లో తొలిసారిగా గౌహతిలో శ్రీ జి.యస్. ఆర్ మూర్తి గారి ఇంట్లో ఒకరోజు, ఆ తరువాత భీమవరంలో ఒకరోజు గడిపిన తరువాత సన్నిహితంగా వారితో మూడు వారాలు ఉండే అవకాశం వారు కల్పించారు,

ఉద్యోగరీత్యా, ఆరు నెలల అమెరికా పర్యటన తరువాత జనవరి 1973లో తిరిగివచ్చి, 24.2.1973న మొట్టమొదటిసారిగా, కారులో బందరునుండి బయలుదేరి, ఆశ్రమానికి వచ్చాము. వారి దర్శనం చేసుకుని, రెండు రోజులలో తిరిగి వెళ్ళిపోదామనుకున్న మమ్మల్ని (నేను, నా భార్య రాధ) సుమారు ఇరవై రోజులు ఆశ్రమంలోనే వుంచి, శ్రీ గురుదేవులు తమ దర్శన భాగ్యాన్ని, బోధామృతాన్ని ప్రసాదించి, మమ్మల్ని పూర్తిగా మార్చేశారు!

అఖండ వైభవంగా మొదటిసారిగా ఆశ్రమంలో జరిగిన శివరాత్రి మహోత్సవాలనుకూడా తిలకించగలిగాము. ఈ సుదీర్ఘ ఆశ్రమవాసము, సత్పురుషుల సాంగత్యము, శ్రీ సద్గురుదేవుల ప్రేమాదరణ కలిగించిన ఆధ్యాత్మికానుభూతి మరువు రానిది. “ఎవరికి ఎప్పుడు ఏది జరుగవలెనో, అది శ్రీ జగన్మాతకి తెలియదా” అని శ్రీబాబుగారు సెలవిచ్చి, ఆధ్యాత్మికానుభూతులను డైరీలో వ్రాసుకొమ్మన్నారు.

తల్లి,తన శిశువుకి ఎప్పుడు, ఏమి కావాలో,ఎలా సమకూరుస్తుందో, అదే విధంగా శ్రీ గురుదేవులు (భగవంతుడు) తన బిడ్డలను ఎల్లప్పుడూ కాపాడుతూనే వుంటారు. శ్రీ గురుదేవులు సర్వాంతర్యామి కనుక, ఈ రక్షణ పొందడానికి వారి సాన్నిధ్యంలోనే వుండనవసరం లేదు.

శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవములో శ్రీ గురుదేవులు శ్రీ జగన్మాతను పూజించిన కుంకుమ, దానితోనే స్వామివారు తమ స్వహస్తములతో మంత్రపూతము చేసిన అక్షతలు, భక్తులందరకు, నవరాత్రి మహోత్సవాలనంతరం జరిగే సద్గురు పాదపూజలో తీర్థ, ప్రసాదాలతోపాటు, ప్యాకెట్లలో ఇప్పించి, ఈ రెంటినీ తమవద్ద జాగ్రత్తగా వుంచుకొని, రక్షణ పొందవచ్చునని వివరించారు. ఈ రెండు గురుదేవులు మనకు ప్రసాదించే symbolic రక్షణ కవచాలు. శ్రీ బాబూజీ మహరాజ్ వారు చెప్పినదానిపైన

సంపూర్ణ విశ్వాసం వుండడమే చాలా ముఖ్యం.

మహిమాన్వితమైన కుంకుమ, అక్షతల ప్రభావం గురించి కొంచెం వివరించుకుందాం:

శ్రీజగన్మాతను పూజించిన కుంకుమ భ్రూమధ్యంలో ధరించాలి. స్త్రీలు పాపిడిలోకూడా ధరించవచ్చును. కుంకుమబొట్టు ముఖానికి కళ ఇవ్వడమే కాక, ధ్యాన సమయంలో ఏకాగ్రతను సాధించేందుకు తోడ్పడుతుంది. అలా ధరించినందువలన జ్ఞాపక శక్తి వృద్ధి చెందుతుంది. మరొక ముఖ్యవిషయమేమంటే ఆ కుంకుమ ఒక చిటికెడు, గ్లాసు నీళ్ళలో వేసుకుని, భగవన్నామస్మరణతో త్రాగినట్లైతే, చిన్న, చిన్న అనారోగ్యాలన్నీ వెంటనే నయమవుతాయి. డాక్టర్లచుట్టూ తిరగనక్కరలేదు.



ఆశ్రమవాసులు తప్పకుండా నుదుట కుంకుమ ధరించే అలవాటు కలవారై వుంటారు. మేము మొదటిసారి ఫిబ్రవరి, 1973లో ఆశ్రమానికి వచ్చినప్పుడు ఒక సాయంకాలం నేను, నా భార్య, శ్రీ వెంకటరత్నంగారు, కమలమ్మగారు కలిసి మా కారులో గుంటూరు వెళ్ళాము. అక్కడ ప్రత్యేక ఆంధ్రా గ్రూప్ విద్యార్థులు, కఱ్ఱలతో,రాళ్ళతో కారును చుట్టుముట్టి మాకు ప్రమాద పరిస్థితిని కలిగించారు. వారు మమ్మల్ని ఆపి, లైట్లు వేసి చూసి, శ్రీగురుదేవుల దయ వలన,మమ్మల్ని వెనక్కి వెళ్ళిపొమ్మన్నారు. వాళ్ళు లైట్లు వేసి చూసినప్పుడు, వారికి మా నుదుటి మీద మహిమాన్వితమైన కుంకుమ బొట్టు, అక్కడనుంచి ప్రసారమైన కిరణములు కనిపించిఉంటాయనడంలో సందేహం లేందు. ఆ డివైన్ రేస్ (Divine Rays) యొక్క రక్షణా ప్రభావం గురించి వేరే చెప్పాలా?

అలానే 31.3.1973న విశాఖపట్టణంలో కె.జి. హాస్పిటల్ Down లో వస్తుంటే, ఒక రిక్షా, అందులోని ప్రయాణీకుడితో సహా వచ్చి వెనకనుంచి కారును గట్టిగా గుద్దింది. రిక్షా బోర్లా పడినా, రిక్షా నడిపేవాడికి గాని,అందులోని ప్రయాణీకుడికిగాని ఒక్క దెబ్బకూడా తగలకుండా, శ్రీ గురుదేవుల అక్షతలు, కుంకుమ కారులో ప్రయాణిస్తున్న మమ్మల్ని సంపూర్ణంగా రక్షించాయని నా దృఢ నమ్మకము. అలా కాని పక్షంలో ఏ పోలీసు కేసులోనో ఇరుక్కుని, గౌహతీ ప్రయాణం వాయదా పడి ఉద్యోగంలో ఏప్రియల్ 4వతేదీన చేరవలసిన నాకు చాలా ఇబ్బంది కలిగి ఉండేది. ఆశ్రయించినవారిని – శ్రీ గురుదేవులు కొత్తవారైనా, పాతవారైనా– కాపాడుతూనే వుంటారు.

ఇక అక్షతలు – ' ఓం' అని శిరస్సున ధరించాలి. బయటకు వెళ్ళేటప్పుడు ఒకటి ధరించి, ఒకటి నోట్లో వేసుకుంటే దాని వలన వచ్చే రక్షణము వర్ణించటం కష్టం. మనని ఎవ్వరూ హింసించకుండా కాపాడటమే కాకుండా, కర్మ వశాత్తు ఏదైనా దెబ్బ

తగలవలసివుంటే, దానిని చాలా స్వల్పమైన పరిమితిలో ఉండేటట్లు చేస్తుంది. మన మన వస్తువులను చోరులు దొంగిలించకుండా కాపాడుతుంది.

గౌహతి చేరిన తరువాత, నవంబర్ 1వ తేదీ ఉదయం అక్షతను ధరించి ఆఫీసుకు వెళ్ళలేదు- కొంచెమే ఉన్నాయి అయిపోతాయికదా అని. ఆఫీస్‌లో అశాంతికరమైన సంఘటన - 1Dn మెయిల్‌ను సోర్‌భోగ్ స్టేషన్‌లో ప్రయాణీకులు నిలిపివేయడం జరిగింది. ఆ అలజడి ప్రశాంతంగా సద్దుబాటు కావాలని కోరుకుంటూ మధ్యాహ్నం భోజన సమయంలో ఇంటికి వచ్చి, అక్షత ధరించి ఆఫీస్‌కు వెళ్ళాను. ఆశ్చర్యం! అర గంట క్రితమే రైలుని వెళ్ళనిచ్చారని తెలిసింది. లేకపోతే ఆ ఊరికి బయలుదేరి వెళ్ళి, ఇబ్బంది పడవలసివచ్చేది. శ్రీ గురుదేవులు ఇచ్చిన అక్షతలు సదా శుభాలను చేకూర్చుతాయని నిర్ధారణగా తెలిసింది.

ఈ అక్షతలు, తృప్తికరంగా పండని బీడు భూమిలో భగవన్నామస్మరణతో జల్లుకుంటే, ఫలసాయం ద్విగుణీకృతంగా వుంటుంది. అలా జల్లడానికి మనం ఆశ్రమంనుంచి తీసుకువెళ్ళిన అక్షతలు మనం తయారు చేసుకున్న అక్షతలతో కలిపి పొలంలో జల్లుకోవచ్చును. మనం ప్రయాణం చేసేటప్పుడు ఎల్లప్పుడూ ఈ కుంకుమ, అక్షతలు మన దగ్గర వుంచుకుంటే అన్నివిధాల రక్షణ జరుగుతుంది.

శ్రీ గురుదేవులను పూజించిన గులాబి పుష్పములు,ఔషధంగాకూడా వాడుకోవచ్చును. ఈ రేకులు ఎండబెట్టి, నిలువ చేసుకోవచ్చును. 29.10.1973న గౌహతిలో రాత్రి బాగా తలనొప్పి వచ్చింది. సాధారణంగా 'సారిడాన్' మాత్రలు వేసుకొనే అలవాటు ఉండేది నాకు. కాని ఇప్పుడు ఆశ్రమంనుంచి తెచ్చుకొన్న గులాబీరేకులు కొన్ని నోట్లో వేసుకున్నాను. మనస్సులో వీటి మహత్యం చూడాలనికూడా అనుకొన్నమాట వాస్తవమే. పావుగంటలో నిద్రపట్టి, నెప్పి పోయిందంటే ఆశ్చర్యపడవలసినదేమీ లేదు. శ్రీగురుదేవులు, నమ్మకంతోవాటిని ఔషధంగా వాడుకోవచ్చునన్నమాట ఎంత సత్యమో అనిపించింది.అలానే 2.1.1974న పన్ను నెప్పి ఎక్కువగా వచ్చినప్పుడు, రైల్వే హాస్పిటల్‌లో ఉచితంగా వైద్య సౌకర్యం ఉన్నాకూడా, శ్రీబాబూజీ మందు - గులాబీ రేకులు తీసుకొంటే మూడురోజుల కల్లా పూర్తిగా నయమయిందని చాలా సంతోషించాను! అందుకనే కదా! శ్రీ గురుదేవులు భక్తులకు కావలసినవి :

1. విశ్వాసము.

2. గురువాజ్ఞా పాలన,

అని ఎల్లప్పుడూ హెచ్చరిస్తూ ఉండేవారు. కుంకుమకు, అక్షతలకు,శ్రీ గురుదేవులను పూజించిన పుష్పాలకు అంత మహిమ ఉన్నదనే సంపూర్ణ విశ్వాసమును పెంపొందించుకుంటే, జీవితంలో చాలా కష్టాలు గట్టెకినట్లే!

*

## మేలిముసుగు

- ఎ. రాధ

భీమవరంలో ఒక సినిమాహాలు యజమాని ఉండేవారు. సాయంత్రం కాగావే హాలు ప్రాంగణంలో కుర్చీలో కూర్చుని సినిమా ప్రదర్శన చూసేందుకు వచ్చే స్త్రీలను చూస్తూ ఉండేవాడు. ప్రదర్శించిన చిత్రం స్త్రీలను ఆకర్షిసుందో లేదో తెలుసుకోవటం అతని అభిలాష కాదు. స్త్రీల సౌందర్యాని తిలకిస్తూ పులకరించటం అతని అలవాటు. ఈ అలవాటు ఎప్పుడు ఆరంభమైందో తెలియదుగాని, అది దినదినాభివృద్ధి చెంది స్వభావంగా రూపు దాల్చింది.

ఒకనాడు హాలు యజమాని, దత్తుమాస్టారుగారు హాలు ఆవరణలోని శిలాఫలకం మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. స్త్రీల రాక ఆరంభమైంది. యజమాని నేత్రాలు సుందరాంగుల అందాలను వెతుకుతున్నాయి. మనస్సు పారవశ్యంలో మునిగిపోతోంది. దత్తుమాస్టారు మాటలకు 'ఊఁ... ' కొడుతున్నాడే తప్ప ఆ మాటలు అతని తలకెక్కటం లేదు.

ఇంతలో వీరికి చిరపరిచితులైన కోర్టు అమీనా సుబ్రహ్మణ్యంగారు హాలు ఆవరణలో ప్రవేశించారు. ఆయన సరసనే మేలి ముసుగు ధరించిన కోమలాంగి ఆకర్షణీయమైన శరీర వంపులతో నడచివస్తోంది. ముసుగులోని సౌందర్యాన్ని చూడాలనే తహతహ అతనిలో జ్వలిస్తోంది. ఆ తాపం చల్లారేదెలా?.....?

భగవంతుడు కరుణించాడు. యజమాని సమీపానికి రాగానే ఆస్త్రీ తన ముసుగు తొలగించి, మందస్మిత వదనంతో తన క్రీగంటి చూపును అతనిపై ప్రసరించింది. అతడు తన్మయుడయ్యాడు. ఏమీ! అపురూప లావణ్యం! ఏమీ రూప సౌందర్యం! ఈమె లావణ్యం ముందు శ్రీమహావిష్ణువు ధరించిన మోహినీ రూపం కూడా వ్యర్థమేనని భావించాడు.

ఆ స్త్రీ ఎవరో తెలుసుకోవాలనే కుతూహలం హాలు యజమానిలో పొంగి పొరలింది. ఇంతలో ఆమెను హాలులో కూర్చోబెట్టి అమీనా సుబ్రహ్మణ్యంగారు వీరి వద్దకు రానే వచ్చారు.

"ఏం సుబ్రహ్మణ్యం నీ వెంట వచ్చిన ఆమె ఎవరు?" అన్నాడు యజమాని.

"నా వెంట ఆమె రావడమేమిటండీ? ఈ మధ్య మీకు పురుషులు కూడా స్త్రీల వలెనే కనిపిస్తున్నారా ఏమిటి ఖర్మ?" అని సుబ్రహ్మణ్యం గారు చురక వేశారు.

"ఆపవోయి నీ ఎగతాళి. నీవు హాలులో కూర్చోబెట్టిన దెవరిని?" అన్నాడు యజమాని.

"హాలులో బాబుగారిని కూర్చోబెట్టి వచ్చానయ్యా!" అన్నారు సుబ్రహ్మణ్యంగారు.

"నీ ప్రక్కనే ముసుగు ధరించి వచ్చిన ఆమె గురించి నేనడిగేది" అన్నాడు యజమాని.

"నా ప్రక్కన ముసుగు ధరించి ఎవరు వచ్చారండీ? నా ప్రక్కన నడిచి వచ్చింది 'బాబుగారే' కదండీ!" అన్నాడు.

"నీవు చెప్పేది ఆశ్చర్యంగా ఉందోయి. ఆమె ముసుగు తీసి నా వంక చూసింది కూడాను. నేనింతవరకూ అంతటి సౌందర్యవతిని చూడలేదు" అన్నాడు యజమాని.

ఈ మాటలు వినగానే సుబ్రహ్మణ్యం తలలో ఏదో తళుక్కున మెరిసింది. యింటి వద్ద నుండి తాను బాబుగారితో బయలుదేరినప్పుడు బాబు ముఖంలో అర్థనారీశ్వర రూపం గోచరించింది. ఇక్కడ హాలు యజమానికి జగత్తునే మోహింప జేయగల సుందర రూపం గోచరించింది. ఈ విషయం హాలు యజమానికి, దత్తుమాస్టారుకు సుబ్రహ్మణ్యం ఎరుక పరిచారు. వారు కూడా విస్మయం చెందారు.

ముగ్గురూ కలిసి హాలులో ప్రవేశించారు. అక్కడ బాబు సుఖాసీనులై కూర్చుని ఉన్నారు.

హాలు యజమానిలో ఆలోచనా తరంగం ఉవ్వెత్తున లేచింది. సుబ్రహ్మణ్యానికి అర్థనారీశ్వరునిగా, తనకు జగన్మోహినిగా సాక్షాత్కరించిన బాబు సామాన్యులు కారు. తన ప్రవృత్తిని మార్చేందుకు వారు కరుణతో తనకు గల స్త్రీ సౌందర్యలోలతను గ్రహింపజేశారు.

భగవంతుని మనోహరాకృతి ముందు స్త్రీల సౌందర్యమేపాటిది? తాను ఎంతో కాలాన్ని దుష్ప్రవర్తనతో వృధా పరిచాడు. ఇక అలా జరగటానికివీలులేదు. అంతే! ఆనాటి నుండి అతడు హాలు ప్రాంగణంలో కుర్చున్న పాపాన పోలేదు!!

*

- శ్రీహరి

## కాలాతీతుడు

పోతునూరు గ్రామంలో శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతున్న సమయంలో నేను, మరియొక భక్తుడు ఉదయం 8గం.లకు గుండుగొలను నుండి బయలుదేరి బాబూజీ సన్నిధానానికి చేరుకొని, అక్కడ వారి బోధలు విని తీర్థప్రసాదాలు స్వీకరించి తిరిగి ఇంటికి వచ్చేవాళ్ళం. ఆ రోజు మామూలు వేళకే బయలుదేరి బాబు బోధామృతాన్ని మననం చేసుకుంటూ, నడక సాగించాము. మా రాకను గమనించిన ఆ గృహస్థ భక్తుడు మమ్మల్ని అప్యాయంగా ఆహ్వానించి, "బాబు పూజలో ఉన్నారు. మీరు కూర్చోండి" అన్నారు. మేము "సమయం ఎంత?" అని ప్రశ్నించాము. "ఒంటిగంట" అని జవాబు. మేము ఆశ్చర్యంతో ఒకరి ముఖాలు ఒకళ్ళు చూ సుకున్నాము. రెండుమైళ్ళ దూరం! 5గంటల ప్రయాణం! ఏమిటీ అద్భుతం! ఎక్కడా ఆగకుండా ప్రయాణం చేశాము. అంతా అయోమయంగా ఉంది. కలా? వైష్ణవ మాయా? ఆ మాయను బాబు తొలగించాల్సిందే!

సాయంత్రం 5గం.లకు శ్రీబాబు తన గదిలో భక్తులకు దర్శనం యిచ్చారు. నమస్కారాలు పూర్తి అయ్యాక శ్రీబాబు రెండోమారు పూజకి అమ్మగదిలోకి వెళ్ళారు. మేము అడగదలచిన సందేహాన్ని మరచిపోయాము.

రెండవ పూజ ముగిసింది. తీర్థప్రసాదాలు తీసుకున్నాక శ్రీబాబును సెలవు అడగటానికి వెళ్ళాము. వారు తమ గడియారం చూసి "సమయం రాత్రి 12 గం.లు అయింది. తె॥జా 4గం.లకు యింటికి చేరతారా?" అన్నారు. "ఎందుకు? ఒక గంటలో వెళ్ళగలము" అన్నాము మేము. "మనిషి గంటకు ఎన్ని మైళ్ళు నడవగలడు?" శ్రీబాబు ప్రశ్న. "నాలుగు మైళ్ళు నడవగలడు" అన్నాము. "సరే వెళ్ళిరండి" అన్నారు శ్రీబాబు. ఉదయం మాకు కలిగిన సందేహాన్ని అప్పుడు కూడా బాబుని అడగటం మర్చిపోయాము.

ఆనాటి బాబు బోధామృతాన్ని మననం చేసుకుంటూ నడుస్తున్నాము. ఇంట్లో అడుగుపెట్టేసరికి చూపులు గోడమీద ఉన్న గడియారం మీదకు మళ్ళాయి. ఏమి చెప్పను! తె.జా 4గం.ల సమయాన్ని చూపిస్తోంది. బాబు '4గంలకు చేరగలరా?' అని అడగటం, మేము 'అబ్బే ! ఒక గంటలో చేరుతాము' అని చెప్పటం గుర్తుకొచ్చింది. బాబు తన మాట ప్రకారం రెండు మైళ్ళు 4గంటలపాటు నడిపించారు. మరునాడు బాబుకి తప్పక యీ విషయం నివేదించాలి అని నిశ్చయించుకున్నాము.

మరునాడు మా మనస్సులో మాట యింకా చెప్పకుండానే శ్రీబాబుకి నమస్కారం చేసి లేస్తుంటే, "కాలాతీతుడైన వాడిని గురించిన విచారణతో మీలో కాలం లోపించిపోయింది. మహర్షులు, ఆత్మజ్ఞానసంపన్నులు వేల సంవత్సరాలు తపస్సు చేసి ఆ స్థితిని చేరుకుంటారు. అట్టి స్థితి మీకు అతి సునాయాసంగా లభించటం మీ అదృష్టం!" అన్నారు శ్రీబాబు.

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి - విజయేశ్వరానంద ప్రసాద్

## చిరంజీవిరాజుగారితో శ్రీబాబు

వ్యాస మహర్షి కూడా తమ తండ్రిగారి వలెనే తనను మించిన తనయుని మానవాళికి మార్గదర్శకులుగా అందించటానికి, ఘృతాచి అనే అప్సరసను చూసి ముచ్చటపడినట్లు లీల నెరపి, ఆమె భయపడి చిలక రూపం ధరించటం వలన శ్రీశుక మహర్షిని నిజపుత్రునిగా పొంది లోకానికి అందించిన విషయము పురాణ ప్రసిద్ధమే!

ప్రస్తుతానికి వచ్చినప్పుడు చిరంజీవిరాజుగారి దీక్ష నిస్సంశయంగా అకళంకమైనది. కాని శ్రీబాబు తమ లోకోద్ధరణ కార్యమును తమ అనంతరం మహెూజ్జ్వలంగా ముందుకు నడపటానికి కావలసిన ఉత్తమ వారసురాలిని చిరంజీవిరాజుగారి ద్వారానే పొందవలసి ఉన్నది. అది జరగాలంటే రాజుగారు తమ అకుంఠిత బ్రహ్మచర్యదీక్షను ఒకింత సడలించి విషయోన్ముఖులు కావాలి. అందుకొరకై శ్రీబాబు తాము 1954వ సంవత్సరంలో అదృశ్యులై ఉండి, తమ సంకల్పంతోనే చిరంజీవి రాజుగారి దీక్షకు వికల్పాన్ని కలిగించి, వారిని సంసారోన్ముఖులను గావించి, వారి ద్వారా పూజ్యశ్రీ మాతాజీని మనకు అందించారు. ఇది సమర్థ సద్గురుదేవులైన శ్రీబాబు ఆద్యంతమూ అద్భుతంగా నిర్వహించిన లోకకళ్యాణ లీల!

1955 సంవత్సరం నుండి మూడు సంవత్సరాలపాటు శ్రీదేవీ శరన్నవరాత్రి మహెూత్సవాలు గుండుగొలనుకు రెండు కి.మీ దూరంలో ఉన్న పోతునూరు గ్రామంలో, శ్రీగూడూరి రాఘవరావుగారి యింట్లో జరిగాయి. ప్రతి సంవత్సరం రాజుగారు సకుటుంబంగా ప్రతిరోజూ పూజలకు పోతునూరు వెళ్ళేవారు. కాని, 1955లో శ్రీ రాఘవమ్మగారు నిండు గర్భిణిగా ఉన్నారు. దసరా పూజల సమయానికి ఆమె ప్రసవించే రోజులు కావటం వలన ఏలూరు ఆసుపత్రిలో ఉన్నారు. పోతునూరు నుండి శ్రీబాబు ప్రతిరోజూ తీర్థ ప్రసాదములు, కుంకుమ ఆమెకు పంపేవారు.

పూజలు పూర్తి అయినాయి. ఆశ్వయుజ పూర్ణిమనాడు రాఘవమ్మగారు ఆడ శిశువును ప్రసవించారు. పెళ్ళిళ్ళూ, పురుళ్ళూ జరిగే స్థలాలలకు మామూలుగా శ్రీబాబు వెళ్ళేవారు కాదు. కాని ఆ శిశువు తమ అవతార కార్య నిర్వహణకు వారసురాలు కావలసి ఉన్నందువలననేమో, శ్రీబాబు ఏలూరు వెళ్ళి, ఆసుపత్రిలో పురిటగది బయటనే ఉండి, శిశువును రప్పించి, తృప్తిగా చూసుకుని, మనసారా ఆశీర్వదించి వెళ్ళిపోయారు.

మనదేశంలో ఎందరో మహాత్ములు పూర్ణిమ నాడు అవతరించారు. పూర్ణిమనాటి షోడశకళా పరిపూర్ణుడైన పూర్ణచంద్రుని వంటిది ఆత్మజ్ఞానము. కనుక

పూర్ణిమనాడు జన్మించిన ఆ శిశువు పరిపూర్ణ బ్రహ్మజ్ఞాన సంపన్నురాలై, ఒక మహావైభవోపేతమైన ఆశ్రమానికి ఆధిపత్యాన్ని వహిస్తుంది అనటానికి అది సంకేతమన్నమాట.

ఆనాడు అశ్వినీ నక్షత్రం. అశ్వినీ నక్షత్రానికి ఉండే నామాక్షరములకు కూడా అనుకూలంగానే, ఆ శిశువు నామకరణంలో 'చంద్ర' అనే పదంచోటుచేసుకుంది.

చిరంజీవిరాజుగారు ఒకప్పుడు సకుటుంబంగా, శ్రీబాబుతో కలిసి పండరీపుర యాత్రకు వెళ్ళినప్పుడు వారంతా చంద్రభాగానదిలో స్నానం చేస్తుండగా, శేషమాంబగారి బంగారు గొలుసు నదిలో పడిపోయింది. శ్రీబాబు నదిలో నుంచి ఆ గొలుసును వెలికి తీసి ఆమెకిచ్చారు. ఆ విధంగా చంద్రభాగానది పేరు కూడా కలిసివచ్చింది.

ఇక నాయనమ్మగారైన శేషమాంబగారి పేరులో 'శేష' పదం కూడా శిశువు నామధేయంలో కలిసింది.

జగన్మాతను తలచుకొనేందుకు వీలుగా 'అంబ' అనే పదం కూడా కలిపి, శ్రీబాబు ఆ శిశువుపేరు 'చంద్ర శేషమాంబ' అని నిర్ణయించారు.

1956 సం॥నుండి చిరంజీవి రాజుగారు కొన్నాళ్ళు భీమడోలులో కాపురం పెట్టారు. అక్కడికి కూడా శ్రీబాబు తరచుగా వెళ్ళి వాళ్ళకు దర్శనం యిస్తూ ఉండేవారు. శ్రీబాబు ఎప్పుడు వచ్చినా, వారి రాక విషయం రాజుగారికిగాని, శేషగిరిరావుగారికి గాని ఏదో సాంకేతికంగా ముందే సూచన కలిగేది. వీలైతే వాళ్ళిద్దరూ లేదా రాజుగారో ఏలూరు స్టేషనికో, లేక నిర్ణీత సంకేత స్థలానికో వెళ్ళి శ్రీబాబు రాకకోసం వేచి వుండేవారు. శ్రీబాబు తప్పక వచ్చేవారు.

ఒకసారి శ్రీబాబు భీమడోలులో రాజుగారింటికి వెళ్ళారు. ఎందుకో రాజుగారికి ముందుగా సూచన ఏమీ అందలేదు. ఆయన గదిలో ఉండి గ్లాసులో బీరు పోసుకుని, తాగటానికి సిద్ధంగా ఉండగా, తలుపు చప్పుడైంది. రాజుగారు కంగారుగా లేచి, బీరుగ్లాసు దేవుడి గదిలో పెట్టి, తలుపువేసి వచ్చి, వీధి తలుపు తెరిచారు.

ఎదురుగా నవ్వుతూ శ్రీబాబు! రాజుగారు హడావిడిగా 'దయచేయండి బాబూ!' అంటూ తమ గదివైపు దారి తీశారు. "వస్తానుగానీ చిరంజీవీ! నీవు ప్రతిరోజూ శ్రద్ధగా పూజించుకునే మీ దేవుని గదిలోకి వెళ్ళి, నువ్వు అర్చించే ఆ మూర్తిని చూసి రావాలనిపిస్తోందయ్యా!" అంటూ, రాజుగారు నసుగుతూ వెనుకంజ వేస్తున్నా కూడా శ్రీబాబు గబగబా దేవుడి గదిలోకి వెళ్ళారు. బీరు గ్లాసును చూపిస్తూ "ఓహో! ప్రతిరోజూ నువ్వు ఈ పవిత్రతీర్థాన్ని దేవుడికి నివేదన చేసి తీసుకుంటున్నావన్నమాట!" అన్నారు.

– సశేషం

# శ్రీ రాధా మాధవ రస సుధ

## (శ్రీరాధకు శ్రీకృష్ణుని ప్రేమోద్గారం)

- శ్రీ హనుమాన్ ప్రసాద్ పోద్దార్

రాధికా! నీవే జీవనాధారం
అనుపమ అమర ప్రాణ సంజీవినీ - నీ సమానులెక్కడా లేరు.
ఈ శరీరంలో అంగాలు తమతమ స్థానాలలో ఉండి శోభిస్తున్నప్పటికీ
ప్రాణం లేకుంటే అవి వ్యర్థం - రాగహీనమవుతవి.
అట్లాగే ప్రియా - సర్వసుఖానికి నీవు ఏకైక
ఆధారం



నీవు లేనిదే, అందరికి ప్రియమైన జీవనంలో
రసమే లేదు
నీ ప్రాణమే నన్ను అనుప్రాణితం చేస్తుంది.
నీ మనస్సే నాకు మనస్సునిస్తుంది.
నీ ప్రేమసింధుసీకర బిందువుతో
ఎల్లరకూ రసదానం చేస్తాను.
నీ పుణ్యరస భండారం నుంచి రసదానం
చేసినా, అది నిగ్రహ సంభ్రమ భయ నమ్రతా
సంకోచాలతోనే చేస్తాను.
నీ సమానమగు నిస్సంకోచ రసస్వామిని
ఎప్పుడూ ఎక్కడా లేదు.
నాపై అనంతమూ నిత్యమూ అయిన సత్వమూ అన్ని విధాల సంపూర్ణమూ
అయిన అధికారం గలదానివి.
వివిధ కాయ వ్యూహాలతో (గోపికలతో) పరమోదారభావంతో రసవితరణ
చేయిస్తావు.
నీ యొక్క మధుర రహస్య మోహినీమాయకు వశుడనయి,
నీ యొక్క దక్షిణ వామ రసాస్వాదనంలో నేను నిమిత్తమాత్రుణ్ణి
అవుతూ ఉంటాను.

విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

# జ్ఞానదేవుడు

గోదావరి తీరాన 'ఆపేగావ్' అనే గ్రామంలో గోవిందపంత్, నీరూబాయి అను పుణ్యదంపతులు ఉండేవారు. అనేక వ్రతముల ఫలితంగా వారికి ఒక కుమారుడు కలిగాడు. అతనికి విఠల్‌పంత్ అని నామకరణము చేశారు. విఠల్‌పంత్ చిన్నతనమునుంచి భగవద్భక్తి కలవాడు. గోవిందపంత్ కుమారునికి ఉపనయనము చేసి, వేద, శాస్త్ర, పురాణాది విద్యలలో నిష్ణాతునిగా తీర్చిదిద్దాడు. యుక్తవయస్సు వచ్చాక విఠల్ పంత్‌కు వివాహం చేయాలని సంకల్పించారు. విఠల్‌పంత్ మనస్సు భగవంతుని పావన చరణాలపై లగ్నమయి ఉన్నందున అతనికి వివాహంపై ఇచ్ఛలేకుండా పోయింది.



విఠల్‌పంత్ తండ్రి వద్దకు వచ్చి "తండ్రీ! నాకు వివాహముపైన ఇచ్ఛలేదు. నాకు తీర్థయాత్రలు చేయాలని కోరికగా ఉంది. మీరు అనుమతిస్తే తీర్థయాత్రలకు వెళతాను" అన్నాడు. గోవిందపంత్ చింతాక్రాంతుడై, 'ఇంత చిన్న వయస్సులో తీర్థయాత్ర చేయటం ఎందుకు? చతురాశ్రమములలో గృహస్థాశ్రమము ప్రశస్తము' అని చెప్పాడు. విఠల్‌పంత్ 'తీర్థయాత్రనుంచి తిరిగి వచ్చాక వివాహం చేసుకుంటాను' అని చెప్పాడు. గోవిందపంత్ సమ్మతించి ఒక సంవత్సరము లోపల తీర్థయాత్ర ముగించుకు రమ్మని చెప్పాడు.

విఠల్‌పంత్ హరినామస్మరణము చేస్తూ ద్వారకలో వెలసిన శ్రీ కృష్ణుని దర్శించి, రుక్మిణి, కృష్ణులు వివాహము జరిగిన మూలమాధవమునకు వెళ్ళి, శ్రీ కృష్ణుడు పరమపదించిన వాలుకా తీర్థాన్ని సేవించి, సోమనాథంలో ముచికుందుని నివాస స్థానమును, కాలయముడు భస్మమైన గుహను వీక్షించి, మరియు అనేక పుణ్యతీర్థాలను సందర్శించి, నాసికాత్ర్యంబకంను దర్శించి, అలంది పురానికి వెళ్ళి

ఒక పొద చాటున కూర్చుని దేవతార్చన చేసుకొంటున్నాడు. అలంది పురవాసి అయిన కులకర్ణి సిద్ధోపంత్ అను బ్రాహ్మణుడు అతిథి కోసం వెదుకుతూ అక్కడికి వచ్చి విఠల్‌పంత్‌కు నమస్కరించి "స్వామీ! నేను అలంది పురవాసిని. చక్రతీర్థానికి స్నానానికి వచ్చే బ్రాహ్మణులను నా ఇంటికి తీసుకుని పోయి భోజనం పెట్టి పంపుతాను. ఈ రోజు నువ్వు ఒక్కడివే కనబడ్డావు. మా ఇంటికి భోజనానికి రండి" అని కోరాడు. విఠల్‌పంత్ అందుకు సమ్మతించి అతని ఇంటికి వెళ్ళాడు. సిద్ధోపంత్ విఠల్‌పంత్‌ను దైవస్వరూపునిగా భావించి పంచభక్ష్య పరమాన్నాలతో భోజనం పెట్టాడు. అనంతరం, అతనితో తత్త్వ విషయాల గురించి గోష్టి జరిపాడు. సిద్ధోపంత్ ప్రార్థనపైన విఠల్‌పంత్ ఆ రాత్రి అక్కడే ఉండిపోయాడు.

తెల్లవారుజామున సిద్ధోపంత్‌కు పుండరీకవరదుడు కనబడి, విఠల్‌పంత్‌కు నీకుమార్తెనిచ్చి వివాహం చెయ్యి, వారికి దైవాంశ సంభూతులైన నలుగురు బిడ్డలు పుడతారు అని చెప్పి అదృశ్యుడైయ్యాడు.

సిద్ధోపంత్ ఈ స్వప్న వృత్తాంతాన్ని విఠల్‌పంత్‌కి చెప్పి తన కుమార్తె రుక్మాబాయిని వివాహం చేసుకోమ్మన్నాడు. విఠల్‌పంత్ ఉలిక్కిపడి "అయ్యా! మంచిమాట చెప్పారు. బావిని తవ్వబోయి భూతాన్ని చూసినట్లయింది. ఇందుకేనా నన్ను మీ ఇంటికి తీసుకు వచ్చింది? నేను వెళ్ళివస్తాను" అన్నాడు. సిద్ధోపంత్ విఠల్‌పంత్ చెయ్యిపట్టుకొని "నీవు ఇలా కోపించి వెళ్ళటం ఉచితంకాదు" అన్నాడు. విఠల్‌పంత్ "స్వయంగా భగవంతుడే వచ్చి చెప్పినా నేను ఈ వివాహానికి ఒప్పుకోను" అన్నాడు. సిద్ధోపంత్ "నీవు వివాహం చేసుకోక పోతే నాకుమార్తె ప్రాణాలు విడుస్తుంది. పుత్రికా శోకంతో మేము కూడా దేహత్యాగం చేస్తాం. ఈ పాతకం నీకు చుట్టుకుంటే నీకు యాత్రాఫలం దక్కదు. మోక్షం సిద్ధించదు" అన్నాడు. ఇది విని విఠల్‌పంత్ కలతచెంది భగవంతుని ప్రార్థించగా భగవంతుడు అదృశ్యంగా ఉండి "విచారించకు. నీవు సిద్ధోపంత్ కుమార్తెను వివాహము చేసుకో. నీకు సకలార్థసిద్ధి లభిస్తుంది" అని పలికాడు. "ఇప్పుడేమంటావు ఇకనైనా ఈ వివాహానికి అంగీకరించ"మని చెప్పి, ఆ మర్నాడు బంధువులనందరిని పిలచి వివాహమహోత్సవము జరిపించాడు.

విఠల్‌పంత్, సిద్ధోపంత్‌కి నమస్కరించి "అయ్యా! నాకు బలవంతంగా వివాహంజేసి మీకు ఆనందంగా ఉంది కదా! ఇప్పుడైనా శలవు ఇస్తే మిగిలిన యాత్ర పూర్తి చేస్తాను" అన్నాడు. సిద్ధోపంత్ కూడా విఠల్‌పంత్ వెంట బయల్దేరాడు. వారిరువురూ దివ్య తీర్థాలను సేవిస్తూ శ్రీశైలం, పండరీపురం, శ్రీరంగం, గోకర్ణం, రామేశ్వరం మొదలైన పుణ్యస్థలాలను దర్శించి పుణ్యతీర్థాలలో స్నానం చేసి అలంది

చేరారు. "ఇక నేను వెళ్ళి మా తల్లిదండ్రులను దర్శించాలి వారు నారాకకై నిరీక్షిస్తున్నారు" అని చెప్పగా, సిద్ధోపంత్ కూడా సకుటుంబంగా అతనితో బయల్దేరి ఆపేగావ్ చేరారు. సిద్ధోపంత్ తన కుమార్తెను వారికి నమస్కారం చేయించాడు. వారు సంతోషించి సిద్ధోపంత్‌తో "స్వామీ! మీ అనుగ్రహం వల్ల నాకుమారుడిని, కోడలిని చూసుకోగలిగాను" అన్నాడు. సిద్ధోపంత్ వారివద్ద సెలవుతీసుకొని స్వస్థలానికి చేరాడు.

కాలక్రమంలో విఠల్‌పంత్‌కు వైరాగ్యం అధికమైంది. రుక్మాబాయి వంక ఒకనాడైనా కన్నెత్తి చూడలేదు. దైవవశాత్తు అతని తల్లిదండ్రులు యోగమార్గం అవలంబించి పరమపదించారు. విఠల్‌పంత్ వారికి విద్యుక్త కర్మలన్నీ జరిపి భార్యతో "నేను నా తల్లిదండ్రుల అస్థికలను గంగానదిలో కలిపి వస్తాను. నువ్వు ఒక్కతెవు ఇక్కడ ఉండలేవు. నిన్ను పుట్టింటిలో దిగపెడతాను" అన్నాడు. విఠల్‌పంత్ అక్కడనుండి బయల్దేరి కొన్నాళ్ళకు కాశిచేరాడు. గంగానదిలో జననీ జనకుల అస్థికలను కలిపి పిండప్రదానము చేసి ప్రయాగకు వెళ్ళి అక్కడ సత్పురుషులతో నిరంతరం వేదాంతశ్రవణము చేస్తూ కాలంగడపుతున్నాడు.

ఎన్నాళ్ళకూ తన భర్త రాకపోవడంచేత రుక్మాబాయి కలత చెంది ఏడ్వసాగింది. సిద్ధోపంత్ ఆమెను ఊరడించి "తల్లీ! నువ్వు కొన్నాళ్ళు గౌరీవ్రతం చెయ్యి, నీ భర్త నీకు లభిస్తాడు" అని చెప్పాడు. ఆమె భక్తి శ్రద్ధలతో ఆ వ్రతం చేస్తోంది.

అక్కడ విఠల్‌పంత్ రామానందస్వామిని ఆశ్రయించి వారివద్ద శిష్యుడిగా చేరాడు. తన గృహస్థ జీవనము గురించి, భార్య గురించి కప్పిపుచ్చి సన్యాసాశ్రమం స్వీకరించాడు. సన్యాసదీక్షను ఇచ్చి విఠల్‌పంత్‌కు 'చైతన్యాశ్రమ స్వామి' అని రామానందస్వామి నామ కరణం చేశారు.

రామానందస్వామి అతనికి అఖండానందాన్ని ఇచ్చే "తత్వమసి" అనే మహావాక్యాన్ని బోధించాడు. విఠల్‌పంత్ గురువుకు నమస్కరించి దాని అర్థాన్ని వివరంగా చెప్పమని ప్రార్థించాడు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL